జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php




సంపుటి 7 సంచిక 222 | హైదరాబాద్, అక్టోబరు 23 సోమవారం 2023 | 8 పేజీలు | వెల : 5.00




# హస్తం ఆశావాహుల గుండెల్లో రైళ్లు..

## పాలమూరులో కాక రేపుతున్న ఆ ఆరు సీట్లు



హైదరాబాద్ : పాలమూరు కాంగ్రెస్‌లో ఆరు సీట్లు టికెట్ల కాక రేపుతున్నాయి. నేడో రేపో జాబితా వస్తుందన్న వార్తలు ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. అటూ అభ్యర్థిగా ఎవరిని ప్రకటిస్తారు.. ప్రచారం ఎవరి కోసం చేయాలని కార్యకర్తలు అయోమయంలో ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో మొదటి దశలో ఏడు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా మిగిలిన ఆరు స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించక పోవడంతో ఆశావహుల్లో టెన్షన్ నెలకొంది. హస్తం అభ్యర్థిత్వానికి ఢిల్లీ స్థాయిలో ఇప్పటికే ప్రయత్నాలు సైతం చేశారు. మొదటి లిస్ట్‌లో పేరు ప్రకటన లేకపోవడంతో తదుపరి జాబితా కోసం వేచి చూస్తున్నారు. అయితే పార్టీలో టికెట్ కు పోటి ఎక్కువగా ఉ ండడంతో ఎవరి ప్రయత్నాలు, ప్రచారాలు వాళ్ళు చేసుకుంటున్నారు.

ఆ ఆరు నియోజకవర్గాలు: మహబూబ్ నగర్, జడ్చర్ల, దేవరకద్ర, వనపర్తి, మక్తల్, నారాయణపేట.

మహబూబ్‌నగర్: మహబూబ్ నగర్ అసెంబ్లీ: నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి టికెట్ తనకే వస్తుందనే పూర్తి విశ్వాసంతో ప్రచారం కొనసాగిస్తున్నారు. పార్టీ క్యాడర్‌తో కలిసి ఆయన విస్తృతంగా ప్రతీరోజూ నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. ఇక్కడ పార్టీని అంటి పెట్టుకొని ఉన్న తమకే అవకాశం దక్కుతుందనే విశ్వాసంతో సీనియర్ నాయకుడు సంజీవ్ ముదిరాజ్ ఉండగా, బీఆర్ఎస్‌పై బలంగా పోరాడిన నాయకుడిగా టిక్కెట్ తనకు వస్తుందనే నమ్మకంతో ఎన్‌పీ వెంకటేశ్ ఉన్నారు.

జడ్చర్ల: జడ్చర్ల నియోజకవర్గంలో తనకే టిక్కెట్ వస్తుందనే నమ్మకంతో అనిరుధ్ రెడ్డి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. పార్టీ ముఖ్యనేతల సూచనలతోనే అనిరుధ్ రెడ్డి ఇక్కడ ప్రచారంలో దూసుకు పోతున్నారు. ఇది నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ సైతం ఈ స్థానం నుంచి టికెట్ ఆశిస్తున్నారు. తనకు పార్టీ అవకాశం కల్పిస్తుందనే నమ్మకంతో ఉన్నారు. ఇప్పటికే కార్యకర్తలతో సమావేశమవుతోంది ప్రచారంలో హోరెత్తిస్తున్నారు.

నారాయణపేట: ఇక నారాయణపేట బరిలో టికెట్ కోసం తీవ్ర పోటీ నెలకొంది. డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి టికెట్ కోసం బలంగా పట్టుబడుతున్నారు. అయితే ఇదే స్థానం నుంచి మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ సైతం టికెట్ ఆశిస్తున్నారు. జడ్చర్ల లేదా నారాయణ పేటలలో ఏదో ఒక స్థానంలో అవకాశం కల్పించాలని కోరుతున్నారు ఎర్ర శేఖర్.

(మిగతా 3లో..)

# 52 మంది అభ్యర్థులతో బిజెపి తొలి జాబితా

### హుజూరాబాద్.. గజ్వేల్ నుంచి ఈటల పోటీ రాజాసింగ్ కూ టిక్కెట్



హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల తొలి జాబితాను భాజపా విడుదల చేసింది. హుజూరాబాద్, గజ్వేల్ నుంచి ఈటల రాజేందర్ పోటీ చేయనున్నారు. ఈమేరకు 52 మందితో తొలి జాబితాను భాజపా అధిష్ఠానం విడుదల చేసింది. బిజెపికి చెందిన ముగ్గురు ఎంపీలు బండి సంజయ్, ధర్మపురి అరవింద్, సోయం బాపూరావులు అసెంబ్లీ బరిలోకి దిగనున్నారు. కరీంనగర్ – బండి సంజయ్, కోరుట్ల – ధర్మపురి అర్వింద్, గోషామహల్ – రాజాసింగ్, సిరిసిల్ల – రాణిరుద్రమ రెడ్డి, దుబ్బాక – రఘునందన్‌రావు, ఖైరతాబాద్ – చింతల రామచంద్రారెడ్డి, ఖానాపూర్ – రమేశ్ రాథోడ్, ఆదిలాబాద్ – పాయల్ శంకర్, బోథ్ – సోయం బాపూరావు, నిర్మల్ –ఆలేటి మహేశ్వర్ రెడ్డి.

# నల్గొండ జిల్లాలో కారు దిగనున్న కీలక నేతలు..



నల్గొండ: నల్గొండ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీకి భారీ షాక్ తగలనుంది. నల్గొండ నియోజకవర్గంలో గత కొంతకాలంగా బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానంపై కొంతమంది నేతలు అసంతృప్తితో ఉన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేపట్టిన కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. దీంతో వీరంతా త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య రసవత్తర పోరు నడుస్తోంది. నల్గొండ నియోజకవర్గంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీలోని కీలక నేతలను ఆకర్షించడానికి కాంగ్రెస్ పార్టీ పలు పథకాలు రచిస్తోంది. కాంగ్రెస్ చేపట్టిన ఆకర్ష్‌కు బీఆర్ఎస్ నేతలు ఆ పార్టీకి రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కారు పార్టీ నేతలను తమ పార్టీలో చేర్చుకునేందుకు భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి రంగంలోకి దిగారు. బీఆర్ఎస్ కీలక నేతలతో వారం రోజులుగా కోమటిరెడ్డి రహస్య మంతనాలు జరుపుతున్నారు. ఈ నేతలంతా కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధమైంది. ఈ నేతల్లో ప్రధానంగా తిప్పర్తి మండల కీలక ప్రజా ప్రతినిధులు, వారిలో నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కీలక నేత ముఖ్య అనుచరుడు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నట్లు విశ్వాసనీయ సమాచారం. వీరిని బుజ్జగించేందుకు కారు పార్టీ అగ్ర నేతలు రంగంలోకి దిగినా చర్చలు మాత్రం ఫలించేలా కనిపించడం లేదు. వారు ఏదో ఒక హామీని ఇచ్చి అసంతృప్త నేతలను శాంతపరుద్దామన్న అధికార పార్టీ అగ్ర నాయకుల బుజ్జగిస్తున్న వారు మాత్రం బీఆర్ఎస్ పార్టీని వీడేందుకే సిద్ధమయినట్లు తెలుస్తోంది. అసంతృప్త నేతలంతా త్వరలోనే కాంగ్రెస్ గూటికి చేరే అవకాశాలు కపినిస్తున్నాయి.

# తెలంగాణ ప్రజలకు కెసిఆర్ బతుకమ్మ శుభాకాంక్షలు



హైదరాబాద్, : తెలంగాణ పూలపండుగ బతుకమ్మ ముగింపు చివరి రోజు 'సద్దుల బతుకమ్మ'ను పురస్కరించుకొని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజల జీవన విధానం నుంచి పుట్టిన ప్రకృతి పండుగే బతుకమ్మ పండుగ అని సీఎం అన్నారు. దేవీదేవతలను అర్చించే పువ్వులే బతుకమ్మగా పూజలందుకోవటం తెలంగాణ ప్రజలకు ప్రకృతి పట్ల ఉన్న ఆరాధన, కృతజ్ఞతాభావనను తెలియజేస్తాయని చెప్పారు. సబ్బండ వర్గాలు సమిష్టిగా జరుపుకొనే బతుకమ్మ పండుగ తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైనదని తెలిపారు. పచ్చదనం, పాడి పంటలు, పశుసంపద, ప్రకృతి వనరుల సమృద్ధితో నేడు తెలంగాణ నిండైన బతుకమ్మను తలపిస్తున్నదని వెల్లడించారు. బతుకమ్మల నిమజ్జన సమయంలో స్వీయ జాగ్రత్తలు, ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ఆనందోత్సాహాలతో సద్దుల బతుకమ్మ పండుగను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని జగన్మాత గౌరీదేవిని ప్రార్థించారు

# హంగ్ లో కింగ్ ఎవరు...?

(వివరాలు 4 లో..)



విజయదశమి సందర్భముగా నేడు ప్రజాపాలన కార్యాలయం సెలవు కావున మంగళవారం సంచిక వెలువడదు పునఃదర్శనం బుధవారం

..ఎడిటర్

# కాళేశ్వరం ప్రాజెక్టు ఎందుకు కుంగిపోయింది : రేవంత్ రెడ్డి



హైదరాబాద్ : కేసీఆర్ కుటుంబం ధనదాహానికి కాళేశ్వరం ప్రాజెక్ట బలైపోయిందని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్ట ప్రపంచానికే అద్భుతమని గొప్పలు చెప్పారని, బస్సులు పెట్టి రైతలు, నేతలను తీసుకెళ్లి కాళేశ్వరం చూపించారని అన్నారు. పంపు హౌసులు మునిగినప్పుడు కాంగ్రెస్ నేతలను చూడనివ్వలేదని, ఇప్పుడు ఎలాంటి వరదలు లేకుండానే ప్రాజెక్టు ఎందుకు కుంగిపోయిందని రేవంత్ ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని రాహుల్ గాంధీ ఎన్నోసార్లు చెప్పారని, కాళేశ్వరం ప్రాజెక్ట డొల్లతనం, నిజస్వరూపం ఇప్పుడు బయటపడిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంగా మారిందని చెబుతూనే ఉన్నామని, ఇప్పటికైనా దీనిపై విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమండ్ చేస్తున్నామన్నారు. కేసీఆర్ గొప్ప ఇంజినీరుగా చెప్పుకుని రూ.లక్ష కోట్లు వథా చేశారని, ప్రాజెక్టుపై సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ దర్యాప్తు జరిపించాలన్నారు. సిట్టింగ్ జడ్జితో ప్రాజెక్టు పనులపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

# మేనిఫెస్టోను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి: కేటీఆర్, హరీశ్‌రావు



హైదరాబాద్: ఎన్నికల సన్నద్ధతలో భాగంగా క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని రకాలుగా సమాయత్తమవ్వడం కోసం ప్రతి నియోజకవర్గంలో ఎన్నికల వార్ రూమ్‌లు ఏర్పాటు చేశామని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ తెలిపారు. వార్ రూమ్‌ల ఇన్‌ఛార్జిలతో మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు హైదరాబాద్‌లోని జలవిహార్‌లో సమావేశం నిర్వహించారు. మేనిఫెస్టో, తొమ్మిదేళ్ల పాలన ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్, హరీశ్‌రావు దిశానిర్దేశం చేశారు. మూస పద్ధతులతో కాకుండా.. కొత్త తరహాలో ప్రజలకు చేరువ కావాలని చెప్పారు. సోషల్ మీడియా ద్వారా కొత్త ఓటర్లకు చేరువ కావాలని పిలుపునిచ్చారు. మేనిఫెస్టోను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచించారు.సంస్కారమంటే ఏమిటో కాంగ్రెస్ నుంచి నేర్చుకోవాల్సిన ఖర్మ తమకు పట్టలేదని కేటీఆర్ అన్నారు. జానారెడ్డి, పీసీసీ అధ్యక్షుడికే సంస్కారం నేర్పించాలన్నారు. కిషన్‌రెడ్డి ఎన్నికల రణరంగంలో వెన్నుచూపి పారిపోయారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. బిజెపికి 100.. కాంగ్రెస్‌కు 40 స్థానాల్లో అభ్యర్థులు లేరన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలు తమతోనే ఉన్నారని చెప్పారు బిఆర్ఎస్ గతం కన్నా మెరుగైన ఫలితాలతో ఘన విజయం సాదిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని సర్వే రిపోర్టులు కూడా స్పష్టం చేస్తున్నాయన్నారు.



# ఓటర్ లిస్ట్ చెక్ చేసుకోండి...



హైదరాబాద్, అక్టోబరు 22, :ఓటర్లు అప్రమత్తంగా ఉండి జాబితాలో తమ పేరును చెక్ చేసుకోవాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ తెలిపారు. 'ఓటర్ ఐడీ కార్డు ఉన్నంత మాత్రాన మీ ఓటు ఉందని భావించవద్దు. జాబితాలో మీ పేరును రీ చెక్ చేసుకోవాలి' అని స్పష్టం చేశారు. హైకోర్టులో స్వీప్ యాక్టివిటీ కింద ఏర్పాటు చేసిన రీ చెక్ యువర్ ఓటు కౌంటర్ ను డిప్యూటీ డీఈవో అనుదీప్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు హైకోర్టు జడ్జిలు, న్యాయవాదులు, సిబ్బందితో మాట్లాడి ఓటరు జాబితాలో తమ పేరు ఎలా చెక్ చేసుకోవాలో అవగాహన కల్పించారు.ఓటర్ హెల్ప్ లైన్ యాప్ ద్వారా ఓటరు జాబితాలో మీ పేరు చెక్ చేసుకోవచ్చని తెలిపారు. ఇతర సందేహాలకు టోల్ ఫ్రీ నెంబర్ 1950ను సంప్రదించాలని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలు సమావేశాలు, ర్యాలీల నిర్వహణ కోసం సువిధ యాప్ ద్వారా ముందస్తు అనుమతులు తీసుకోవాలని, 24 గంటల్లోగా దరఖాస్తులను పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తామన్నారు. జిల్లాలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన వీవీఐపీలు, వీఐపీల పర్యటన సమయంలో స్థానిక పోలీస్ అధికారులతో పాటు పార్టీ నాయకులు సమన్వయంతో పని చేయాలని, ప్రజలకు, ముఖ్య అతిథులకు ఇబ్బందులు కలుగకుండా సమావేశాలు నిర్వహించుకోవాలన్నారు. జిల్లాలో సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల ద్వారా తనిఖీలు ముమ్మరం చేసినట్లు ఎస్పీ తెలిపారు.తెలంగాణ సహా మరో నాలుగు రాష్ట్రాల్లో శాసనసభ సాధారణ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఓటర్ గుర్తింపు నిర్ధారణ విషయంలో కొత్త మార్గదర్శకాలను జారీ చేస్తూ సీఈసీ ఆయా రాష్ట్రాల ఎన్నికల ప్రధాన అధికారులకు ఇటీవల లేఖ రాసింది.ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఓనీటవశ్రీ అనీటవ నీట అనీనిటబీఇబి)ని కచ్చితంగా అమలు చేసి ఎన్నికల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని జిల్లా ఎన్నికల అధికారి, రొనాల్డ్ రోస్ అధికారులకు సూచించారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చినా, మీడియాలో ఫేక్ న్యూస్ ప్రసారమైనా, ఓటర్లు ఏదైనా సందేహాల నివృత్తికి, సమాచారం కోసం సంప్రదించిన వెంటనే స్పందించాలని చెప్పారు. సి-విజిల్ ఫిర్యాదులను వంద నిమిషాల్లో పరిష్కరించాలన్నారు.ఎక్కడైనా మద్యం, డబ్బులు పంపిణీ చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే వెంటనే క్షేత్రస్థాయిలో ఫ్లయింగ్ స్క్వాడ్‌లను అప్రమత్తం చేయాలన్నారు. ప్రతీ విభాగానికి వేర్వేరుగా రికార్డులను నిర్వహించాలన్నారు. ఆయా బృందాలతో శాసనసభ నియోజకవర్గాల వారీగా విధులు నిర్వహించే అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున అధికారులు ఎలాంటి అలసత్వం, నిర్లక్ష్యం లేకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు.ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున అధికారులు ఎలాంటి అలసత్వం, నిర్లక్ష్యం లేకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఎన్నికల సంబంధిత ఫిర్యాదులపై స్పందించాలని, మద్యం, నగదు కానుకల పంపిణీలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సీ విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు.

## ఏరులై పారుతున్న లిక్కర్...

హైదరాబాద్, అక్టోబరు 22, :ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి తెలంగాణలో పెద్ద మొత్తంలో డబ్బు, బంగారంతో పాటు లిక్కర్‌ను పోలీసులు సీజ్ చేస్తున్నారు. ఇవాళ ఒక్క రోజే దాదాపు కోటీ 42 లక్షల రూపాయలు విలువజేసే లిక్కర్ స్వాధీనం చేసుకున్నట్టుగా ఎక్సైజ్ శాఖ ప్రకటించింది. నిర్మల్, నల్గొండ, హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలో షాపుల్లో సీజ్ చేసినట్టుగా అధికారులు చెబుతున్నారు. ఒక్క రోజే నిర్మల్, నల్గొండ, హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలకు సంబంధించిన ఆరు లిక్కర్ షాపుల నుంచి కోటి 42 లక్షల వాల్యూ ఉన్న మద్యాన్ని సీజ్ చేసినట్టుగా ఎక్సైజ్ శాఖ తెలిపింది. నిర్మల్‌లోని ఒక షాపులో 2560 లీటర్లు, నల్గొండలో గల ఒక షాపులో 2876 లీటర్లు, హైదరాబాద్ 2369 లీటర్లు, రంగారెడ్డిలో 5998 లీటర్లు, మేడ్చల్‌లో 3777 లీటర్లు సీజ్ చేసినట్లు చెప్తున్నారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ దాదాపు ఒక కోటి 42 లక్షల విలువ ఉన్నట్టుగా ఎక్సైజ్ శాఖ తెలుపుతుంది ఒక్కరోజులోనే ఇంత పెద్ద ఎత్తున నిల్వ ఉన్న మద్యాన్ని పట్టుకోవడం చర్చనీయాంశమైంది. ఇంకా ఎన్నికలకు 40 రోజుల్లో పైగా సమయం ఉన్న నేపథ్యంలో ఎంతమేర లిక్కర్ పట్టుబడుతుందో అన్నది ఊహకే అందడం లేదు. 2028 ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఎన్నికల్లోనే ఎక్కువ మొత్తంలో లిక్కర్‌ను పోలీస్ శాఖ సీజ్ చేసింది.. 2028 లో జరిగిన సాధారణ ఎన్నికల్లో దాదాపు రెండు కోట్ల 38 లక్షల 22,284 రూపాయల లిక్కర్‌ను గత ఎన్నికల్లో తెలంగాణ పోలీసులు సీజ్ చేశారు.. కానీ ఈసారి దాదాపు ఎన్నికల షెడ్యూల్ వచ్చిన పది రోజుల్లోనే ఇప్పటివరకు మూడు కోట్ల 60 లక్షల 57000 రూపాయలు విలువ చేసే లిక్కర్ సీజ్ చేశారు.. ఇంకా ఎన్నికలకు 40 రోజులకు పైగా ఉన్న నేపథ్యంలో ఈ సారి పట్టుబడే లిక్కు విలువ 50 కోట్లు దారుతుందని అంచనా వేస్తున్నారు.


## వలసలతో నల్గొండ కాంగ్రెస్ జోష్

నల్గొండ, అక్టోబరు 22, :తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు కౌంట్ డౌన్ దగ్గర పడుతుండడంతో నేతలు పార్టీ కండువాలు మార్చేస్తున్నారు. టికెట్ రాలేదని, అసమ్మతితో ఇలా వివిధ కారణాలతో నేతలు పార్టీలు జంప్ చేస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఎన్నికల సమయం కావడంతో బయటి నుంచి వస్తున్న ఆఫర్లను కాదనలేక కొందరు.. ఇప్పటి దాకా ఎమ్మెల్యేలపై అసమ్మతి రగిలిపోయిన కొందరు కొత్త దారులు వెదుక్కుంటున్నారు. ఆయా నియోజకవర్గాల్లో పార్టీ నుంచి కాంగ్రెస్, బీజేపీల్లోకి వెళ్లిపోతున్న వారి సంఖ్య పెరగడంతో అభ్యర్థులు ఒత్తిడికి గురవుతున్నారు.నల్లగొండ, నకిరేకల్, నాగార్జున సాగర్, హుజూర్ నగర్, కోదాడ.. ఇలా పలు నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేల తీరు నచ్చక, ఇన్నాళ్లూ ఓపిక పట్టినా.. ఇప్పుడు ఎన్నికల సమయం కావడంతో ఇక ఏం చేయలేరన్న ఆలోచనతో స్థానిక ప్రజాప్రతినిధుల్లో అత్యధికులు గులాబీ కండువాను పక్కన పడేసి ఎక్కువగా కాంగ్రెస్ కండువాను కప్పుకుంటున్నారు. కొందరు కాషాయ కండువాలూ కప్పుకున్నారు. వారం రోజులుగా బీఆర్ఎస్ నుంచి వలసలు కొనసాగుతున్నాయి.నల్లగొండ నియోజకవర్గంలో బీఆర్ఎస్ కు పెద్ద షాకే తగిలింది. కాంగ్రెస్ అభ్యర్థిగా పేరు ప్రకటించగానే నియోజకవర్గానికి చేరుకున్న భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి నల్లగొండలో చక్రం తిప్పారు. ఒకే రోజు ఆరుగురు బీఆర్ఎస్ మున్సిపల్ కౌన్సిలర్లను లాగేసుకున్నారు. వీరిలో నల్లగొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కూడా ఉన్నారు. మరో ఇద్దరు కౌన్సిలర్లు బుధవారం కోమటిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. రెండు రోజుల్లో ఏకంగా ఎనిమిది మంది మున్సిపల్ కౌన్సిలర్లు పార్టీని వీడడం ఈ ఎన్నికల్లో ప్రభావం చూపనుందన్నఅభిప్రాయం వ్యక్తమవుతోంది. నల్లగొండ నియోజకవర్గంలో రూరల్ ఓటర్ల కన్నా.. నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని అర్బన్ ఓటర్లే అధికం. కాంగ్రెస్ కు ఉన్న కౌన్సిలర్లకు తోడు కొత్తగా ఎనిమిది వచ్చి చేరడం ఈ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ కు మంచి బలం చేకూరినట్లే. ఈ పరిణామం స్థానిక ఎమ్మెల్యే, అభ్యర్థి కంచర్ల భూపాల్ రెడ్డికి ఇబ్బందికరంగా మారనుంది.కోదాడ నియోజకవర్గంలో సిట్టింగ్ అభ్యర్థిని మార్చాల్సిందేనని బీఆర్ఎస్ నాయకులు పట్టపడుతున్నారు. కానీ, పార్టీ నాయకత్వం ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ కే బి ఫారం ఇవ్వడంతో అసమ్మతి నాయకులంతా మూకుమ్మడిగా పార్టీ మారాలని నిర్ణయించుకున్నారు. కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్ రావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కె.శశిధర్ రెడ్డి, మైనారిటీ నాయకుడు మహ్మద్ జానీ, డీసీసీబీ మాజీ చైర్మన్ పాండురంగారావు, మరో నాయకుడు ఎర్నేని బాబ ఇలా అంతా పార్టీ మారేందుకు సిద్ధపడ్డారు. విషయం తెలుసుకుని కాంగ్రెస్ నాయకుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి నేరుగా వేనేపల్లి చందర్ రావు ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానించారు. వీరంతా ఢిల్లీలో కాంగ్రెస్ కండువాలు కప్పుకునేందుకు ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఈ పరిణామం బీఆర్ఎస్ నాయకత్వానికి మింగుడు పడేలా లేదు.నాగార్జున సాగర్ బీఆర్ఎస్ అభ్యర్థి నోముల భగత్ కూ ఇబ్బందులు మొదలయ్యాయి. ఆయన అభ్యర్థిత్వాన్ని ముందు నుంచీ పార్టీలోని ఒక వర్గం వ్యతిరేకిస్తోంది. అయినా.. హైకమాండ్ పట్టించుకోలేదు. ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా కుందూరు జైవీర్ రెడ్డి ప్రకటించగానే ఆయన తండ్రి, పార్టీ సీనియర్ కుందూరు జానారెడ్డి రంగంలోకి దిగి పార్టీ బలం మరింత పెంచే దిశగా పావులు కదుపుతున్నారు. నిడమనూరు మండలంలో యాదవ సామాజిక వర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్ లోకి తీసుకువచ్చారు. గుర్రంపోడు మండలంలో ఏకంగా పన్నెండు మంది సర్పంచులు, ఒక జెడ్పీటీసీ సభ్యుడు, మాజీ ఎంపీటీసీ సభ్యులను బీఆర్ఎస్ నుంచి తీసుకువచ్చి కాంగ్రెస్ కండువాలు కప్పారు. దీంతో బీఆర్ఎస్ నాయకత్వం ఖంగుతిన్నది. పార్టీలో అంతర్గత వర్గాలకు తోడు.. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఖాళీ అవుతుండడం ఆందోళనకు కారణమవుతోంది.హుజూర్ నగర్ నియోజకవర్గం పరిధిలోని నేరెడుచర్ల మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీలతా రెడ్డి, నాగార్జున సాగర్ నుంచి మన్నెం రంజిత్ యాదవ్ తదితరులు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. నకిరేకల్ నియోజకవర్గంలోనూ ఇన్నాళ్లూ బలవంతంగా బీఆర్ఎస్ లో కొనసాగిన వారు.. తిరిగి తమ సొంత గూడు కాంగ్రెస్ కు చేరుకుంటున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మెజారిటీ నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. దీనికి విరుగుడుగా అక్కడక్కడా కాంగ్రెస్ పార్టీకి చెందిన వారిని, కొందరు స్థానిక ప్రజాప్రతినిధులను బీఆర్ఎస్ తీసుకుంటోంది. కానీ, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ కు వెళ్లే వారి సంఖ్యే ఎక్కువగా ఉంటోంది.

## కార్తీక మాసం... పెళ్లిళ్ల సీజన్


హైదరాబాద్, అక్టోబరు 22.: కార్తీక మాసంలో లక్షల పెళ్లిళ్లు జరగనున్నాయి. తులసి కల్యాణం తర్వాత దేశంలో పెళ్లి వేడుకలు ప్రారంభం కానున్నాయంటూ షాకింగ్ గణాంకాలు వెలువడ్డాయి. కోటి రూపాయలకు పైగా ఖర్చు చేసిన పెళ్లిళ్లను చూస్తే మీరు కూడా ఆశ్చర్యపోతారు. దీపావళి తర్వాత అంటే కార్తీక మాసం తులసి కల్యాణం తర్వాత పెళ్లి వేడుకలు మొదలవుతాయి. పండుగల కాలంతో పాటు మరికొద్ది రోజుల్లో పెళ్లిళ్లకు సంబంధించిన కొనుగోళ్లు ఊపందుకోనున్నాయి. రాబోవు రోజుల్లో బిజినెస్ పెరగనుండటంతో వ్యాపారులు సైతం ఇందుకోసం ప్రత్యేకంగా సన్నాహాలు మొదలుపెట్టారు. దీపావళి ముగిసిన వెంటనే ప్రారంభమయ్యే పెళ్లిళ్ల సీజన్ నుంచి భారీ లాభాలు వస్తాయని వ్యాపారులు భావిస్తున్నారు. పెళ్లిళ్ల సీజన్‌లో 23 రోజుల్లో దాదాపు 6 లక్షల పెళ్లిళ్లకు ఒక్కో పెళ్లికి రూ.3 లక్షలు ఖర్చవుతుందని అంచనా వేయగా, దాదాపు 20 లక్షల పెళ్లిళ్లలో ఒక్కో పెళ్లికి రూ.6 లక్షల వరకు ఖర్చు అవుతుందని సీఏఐటీ సెక్రటరీ జనరల్ ప్రవీణ్ తెలిపారు. ఖండేల్వాల్. దాదాపు 22 లక్షల పెళ్లిళ్లకు ఒక్కో పెళ్లికి రూ. 20 లక్షలు, 6 లక్షల పెళ్లిళ్లకు రూ. 25 లక్షలు, 50 వేల పెళ్లిళ్లకు రూ. 50 లక్షలు, 50 వేల పెళ్లిళ్లకు రూ. కోటి లేదా అంతకంటే ఎక్కువ ఖర్చు అవుతుంది.ఈ సంవత్సరం, వివాహ వేడుకల సీజన్ నవంబర్ 23 నుండి ప్రారంభమవుతుంది. ఈ సీజన్ డిసెంబర్ 25 వరకు కొనసాగుతుంది.ఈ కాలంలో దేశవ్యాప్తంగా మొత్తం 35 లక్షల వివాహాలు జరుగుతాయని ఒక అంచనా. ఈ వివాహాల కోసం వివిధ సేవలను అందించే మార్గాలు అనేకం ఉంటాయి. ఈ వివాహ వేడుకల సీజన్‌లో దాదాపు 4.25 లక్షల కోట్ల రూపాయల టర్నోవర్ జరగనున్నట్లు తెలుస్తోంది. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ అధ్యక్షుడు బి. సి. భారతీయ, జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ఖండేల్వాల్ 'క్యాట్' పరిశోధన విభాగం అంటే క్యాట్ రీసెర్చ్ అండ్ ట్రేడ్ డెవలప్‌మెంట్ సొసైటీని ఉటంకిస్తూ ఒక నివేదికను విడుదల చేశారు. దేశంలోని 20 ప్రధాన నగరాల్లో వ్యాపారులు, వివాహ సేవల ప్రదాతలపై ఒక సర్వే నిర్వహించబడింది. ఒక్క ఢిల్లీలోనే ఈ సీజన్‌లో దాదాపు 3.5 లక్షల పెళ్లిళ్లు జరగనున్నాయి. ఢిల్లీలోనే ఈ 23 రోజుల వ్యవధిలో దాదాపు లక్ష కోట్ల టర్నోవర్ జరగనుంది. గతేడాది ఇదే కాలంలో 32 లక్షల వివాహాలు

# హంగ్ లో కింగ్ ఎవరు...?



హైదరాబాద్, అక్టోబరు 22, :తెలంగాణలో ఎన్నికల వేడి రాజుకుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా పొలిటికల్ సీన్ ఉంది. ఎవరిది గెలుపు అనేది ఖచ్చితంగా చెప్పలేని పరిస్థితి. బీఆర్ఎస్, కాంగ్రెస్ పోటా పోటీగా ఉన్నాయి. సర్వేల్లో కాంగ్రెస్ పార్టీదే కొంచెం పై చేయి కనిపిస్తున్నా చివరి నిమిషంలో ఏమవుతుందోనన్న టెన్షన్ అన్ని పార్టీల్లో నెలకొంది. రెండు సార్లు అధికారంలోకి వచ్చిన పార్టీగా కారు పార్టీకి ఈ ఎన్నికలు అంత సులువు కాదు. కానీ అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ బాగా పుంజుకున్నప్పటికీ అది అధికారం అందుకునేంతగా అంటే.. చెప్పలేని పరిస్థితి. దీంతో హంగ్ అసెంబ్లీ ఏర్పడుతుందన్న విశ్లేషణలు కూడా ఊపందుకుంటున్నాయి.తెలంగాణలో హంగ్ వస్తుందన్న అంచనాలు నిజమవుతాయా? లేదా? అన్నది పక్కన పెడితే ఈసారి మాత్రం ఫైట్ వన్ సైడ్ మాత్రం కాదన్నది సుస్పష్టం. అది అధికార బీఆర్ఎస్ నేతలకు కూడా తెలుసు. బీజేపీ పెద్దగా ప్రభావం చూపలేకపోయినా కాంగ్రెస్ మాత్రం విజయం అంచు వరకూ వచ్చే అవకాశం ఉందన్న అంచనాలు నిజమవుతాయని ఎక్కువ మంది విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలు కొంత మార్పును కోరుకోవడం వల్లనే కాంగ్రెస్ బలోపేతమయిందని చెబుతున్నారు. కొన్ని రంగాల ప్రజలు అధికార పార్టీపై వ్యతిరేకతతోనే కాంగ్రెస్ వైపు మొగ్గు చూపడం వల్ల ఈసారి ఏకపక్ష గెలుపు బీఆర్ఎస్ కు సాధ్యం కాదన్న కామెంట్స్ వినపడుతున్నాయి.కొన్ని జిల్లాల్లో కాంగ్రెస్ బాగా పుంజుకుంది. ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో అయితే క్లీన్ స్వీప్ చేసినా ఆశ్చర్యం లేదంటున్నారు. అలాగే వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో కూడా మార్పు వచ్చిందని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో హంగ్ అసెంబ్లీ ఏర్పడటం ఖాయమన్న అంచనాలు వినపడుతున్నాయి. హంగ్ అసెంబ్లీ వస్తే ఏ పార్టీ ఎవరికి మద్దతిస్తుందన్న చర్చ కూడా ఇప్పుడు తెలంగాణలో ఊపందుకుంది. బీఆర్ఎస్ తో నేరుగా పొత్తు పెట్టుకోకపోయినా బీజేపీ ఆ పార్టీ పక్షాన నిలుస్తుందన్న వ్యాఖ్యలు వినపడుతున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి రాకుండా నిలువరించడమే బీజేపీ లక్ష్యం కాబట్టి ప్రభుత్వంలో కలవకుండా బయట నుంచి బీజేపీ మద్దతు ప్రకటించే అవకాశాలను కొట్టిపారేయలేం అంటున్నారు.ఇక కాంగ్రెస్ కు ఎవరు మద్దతిస్తారన్న ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. ఇక ఎమ్మెల్యేల కొనుగోళ్లు కూడా ఎక్కువగా ఉంటాయన్న లెక్కలు వేసుకుంటున్నారు. ప్రతి నియోజకవర్గంలో మంచి ఫైట్ జరుగుతుంది. ఈసారి గెలిచే స్వతంత్ర అభ్యర్థులకు మంచి డిమాండ్ ఏర్పడుతుంది. అయితే ఇండిపెండెంట్ అభ్యర్థులు ఎంతమంది గెలుస్తారు? ఒకవేళ గెలిచినా వారు ఏ గూటికి చేరతారు? అంటే అప్పటికప్పుడు వారికి దక్కే పదవులు, అందే ప్యాకేజీపైనే ఆధారపడి ఉంటుందన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతుంది. మొత్తం మీద హంగ్ అసెంబ్లీ ఏర్పడుతుందన్న విశ్లేషణలతో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకత్వం మాత్రం అప్రమత్తమై ప్రచారాన్ని ఉధృతం చేశాయి. మరి చివరకు ఏం జరుగుతుందన్నది చూడాలి.

# గెలుపు ధీమాలో కాంగ్రెస్...




వరంగల్, అక్టోబరు 22, :కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మూడు రోజుల పాటు తెలంగాణలో పర్యటించారు. ములుగు జిల్లాతో పాటు కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలో ఆయన పర్యటించారు. ఆయన స్ట్రీట్ మీటింగ్స్‌కు బహిరంగ సభలకు జనం పోటెత్తారు. రాహుల్ విమర్శలు కూడా సూటిగా సుత్తిలేకుండా సాగాయి. తెలంగాణ రాష్ట్రం తాము ఏ పరిస్థితుల్లో ఇచ్చింది? దాని వల్ల రాజకీయంగా ఎంత నష్టపోయింది కూడా వివరించారు. కేసీఆర్ కుటుంబ పాలనపై రాహుల్ ధ్వజమెత్తారు. బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం ఒక తాను ముక్కలేనంటూ పదే పదే ఆ మూడింటిపై విమర్శలు చేస్తూ ఆయన ముందుకు సాగారు. రాహుల్ ప్రసంగానికి జనం కనెక్ట్ అయినట్లే కనిపించింది. వాటిని తిని మంచి రెస్పాన్స్... రాహుల్ ప్రతి డైలాగ్‌కు ప్రజల నుంచి వచ్చిన స్పందన చూస్తే ఆయనను చూసేందుకు మాత్రమే కాకుండా ప్రసంగం వినడానికి కూడా ఎక్కువ మంది హాజరయినట్లు జిల్లాల నుంచి అందుతున్న సమాచారం. తొలిరోజు రాహుల్, ప్రియాంక గాంధీలు రామప్ప గుడిని సందర్శించడం అక్కడి నుంచి బస్సు యాత్రను ప్రారంభించి నేరుగా ములుగు జిల్లాకు వెళ్లి అక్కడ బహిరంగ సభలో ప్రసంగించారు. ఈ సభలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలతో పాటు అదనపు హామీలను కూడా ఇచ్చింది. తాము అధికారంలోకి వస్తే కల్యాణలక్ష్మి, షాదీతోఫా కింద ఆడపిల్లల కుటుంబాలకు లక్ష రూపాయల నగదుతో పాటు తులం బంగారం ఇస్తామని కూడా ఇచ్చిన హామీకి బాగానే రెస్పాన్స్ వచ్చింది.తొలి జాబితా అభ్యర్థుల ప్రకటన తర్వాత రాహుల్, ప్రియాంకలు తెలంగాణలో పర్యటించారు. అయితే ఫస్ట్ లిస్ట్ సామాజకవర్గాల పరంగా, నియోజకవర్గాల్లో సర్వేల ఆధారంగా ప్రకటించడంతో అనుకున్న స్థాయిలో అసంతృప్తి కనిపించలేదు. దీనికి తోడు రాహుల్ పర్యటన పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపిందనే చెప్పాలి. తాము ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు పర్చే బాధ్యత తనదేనని రాహుల్ చెప్పడం కూడా ఆకట్టుకుంది. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో తాము ఏ విధమైన సంక్షేమ పథకాలను అమలు చేస్తుందీ కూడా ఆయన చెప్పుకొచ్చారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగానే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్న హామీ కూడా వైరల్ గా మారింది.యువత, మహిళలను ఆకట్టుకునేలా రాహుల్ ప్రసంగం సాగింది. మూడు రోజుల పర్యటనలో మూడు జిల్లాల్లోనూ మంచి స్పందన లభించింది. దీంతో తెలంగాణ శాసనసభ ఎన్నికలు నవంబరు 30 అంటే మిగిలిన నాలుగు రాష్ట్రాల ఎన్నికల తర్వాత జరుగుతుండటంతో చివరి పది రోజులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఇక్కడే మకాం వేసి కాంగ్రెస్‌కు మరింత ఊపు తెచ్చే ప్రయత్నం చేయనున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బీఆర్ఎస్ బలంగా ఉన్న ప్రాంతాల్లోనే వీరి పర్యటనకు రాష్ట్ర కాంగ్రెస్ ప్లాన్ చేస్తుంది. మరి రాహుల్ పర్యటనతో ఈసారైనా తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి అధికారం దక్కుతుందా? లేదా? అన్నది డిసెంబరు 3వ తేదీన తేలనుంది.

## రాజకీయాల్లోకి ప్రభుత్వ ఉద్యోగులు

హైదరాబాద్, అక్టోబరు22 :తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలవడంతో రాజకీయాలు వేడెక్కాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ప్రచారం మొదలు పెట్టేశారు. నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఒకేసారి 225 మంది అభ్యర్థులను ప్రకటించి, ప్రత్యర్థులపై పైచేయి సాధించారు. ఇప్పటికే మెజార్టీ అభ్యర్థులకు బీఫారాలను అందజేశారు. బీఫారాలు అందుకున్న నేతలు నియోజకవర్గాల్లో ఇంటింటికీ ప్రచారం చేస్తున్నారు. ఇటు కేసీఆర్ ప్రతి రోజు 2, 3 నియోజకవర్గాలను తిరుగుతున్నారు. అటు కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీ రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ తెలంగాణలో ప్రచారాన్ని మొదలు పెట్టేశారు. కేసీఆర్ వైఫల్యాలను ఎత్తిచూపుతున్నారు. మరోవైపు ఎన్నికల్లో పోటీ చేసేందుకు తెలుగు రాష్ట్రాల్లోని అధికారులు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలకు రాజీనామా చేసి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోని పలువురు అధికారులు ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగాలకు రాజీనామా ఎన్నికల్లో పోటీ చేశారు. కొందరు రాజకీయాల్లోనూ సక్సెస్ అందుకున్నారు. ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడం ద్వారా ప్రజలకు మరింత సేవ చేయవచ్చని, వారి సమస్యలకు పరిష్కారానికి పాటు పడవచ్చని అంటున్నారు. గెజిటెడ్ అధికారుల నుంచి ఐఏఎస్, ఐపీఎస్ ల వరకూ ఉద్యోగాలకు రాజీనామా చేస్తున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్ ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేశారు. సంగారెడ్డి జిల్లాకు చెందిన ఆయన వైద్య, ఆరోగ్య శాఖలో సూపరింటెండెంట్ గా పని చేస్తున్నారు. ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలన్న లక్ష్యంతో ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నారు. ఉద్యోగానికి రాజీనామా చేస్తూ వీఆర్ఎస్ కు దరఖాస్తు చేసుకున్నారు. మామిళ్ల రాజేందర్ దరఖాస్తును పరిశీలించిన ఉన్నతాధికారులు, ఆయన వీఆర్ఎస్ దరఖాస్తుకు ఆమోదముద్ర వేశారు. త్వరలోనే ఆయన భారత రాష్ట్ర సమితిలో చేరనున్నట్లు తెలుస్తోంది. బీఎస్పీ తెలంగాణ అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, వైసీపీ ఎమ్మెల్యే వరప్రసాద్, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, ఐఆర్ఎస్ అధికారిగా పని చేసిన ఏపీ మున్సిపల్ మంత్రి ఆదిమూలపు సురేష్, మాజీ టీఎన్జీవో అధ్యక్షులు స్వామిగౌడ్, ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఐఏఎస్ అధికారి రామాంజినేయులు ఇలా చెప్పుకుంటూ పోతే జాబితా చాంతాడంతా ఉంది. మొన్నటి వరకు ఏపీలో ఐఏఎస్ అధికారులుగా పని చేసిన విజయ్ కుమార్, కరికాళవళవన్ రాజకీయాల్లోకి వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. విజయ్ కుమార్, కరికాళవళవన్ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. వీరిలో కొందరు స్వచ్ఛందంగా ఉద్యోగాలకు రాజానామా చేస్తే, మరికొందరు రిటైర్ మెంట్ అయ్యాక రాజకీయాల్లోకి ప్రవేశించారు. సీఐగా పని చేసిన గోరంట్ల మాధవ్ వైసీపీ తరఫున హిందూపురం ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు. తెలంగాణ ఎక్సైజ్ మంత్రి శ్రీనివాస్ గౌడ్ టీఎన్జీవో అధ్యక్షుడిగా పని చేశారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన మహబూబ్ నగర్ నుంచి పోటీ చేశారు. 2024, 2028 ఎన్నికల్లో వరుసగా గెలుపొందారు. ముచ్చటగా మూడోసారి పోటీ చేస్తున్నారు. సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ విశాఖ పార్లమెంట్ స్థానం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసినా సక్సెస్ కాలేకపోయారు. ఏపీ మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ ఐఆర్ఎస్ ఉద్యోగానికి రాజీనామా చేసి వైసీపీలో చేరారు. 2024, 2029 ఎన్నికల్లో గెలుపొందారు. జగన్మోహన్ రెడ్డి కేబినెట్ లో మంత్రిగా పని చేస్తున్నారు.

## దేశభక్త యువజన సంఘం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహాఅన్నధానం కార్యక్రమం ప్రారంభించిన మల్లు సూర్య విక్రమాదిత్య



మధిర అక్టోబర్ 22 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో లడక్ బజార్ నందు శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దేశభక్త యువజన సంఘం ఉత్సవ కమిటీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ శాసనసభ పక్ష నేతశాసన సభ్యులు లి"గౌ" శ్రీ మల్లు భట్టి విక్రమార్క లి తనయుడు లిమల్లు సూర్య విక్రమాదిత్యలి అనంతరం మహాఅన్నధానం కార్యక్రమం ప్రారంభించారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేవీ నవరాత్రులు సందర్భంగా మహానదానం అందరికి ఉండాలి కార్యక్రమం నిర్వహించడం అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలని అన్నం పరబ్రహ్మ స్వరూపిణి అన్నదానం చేయటం అమ్మ కనకదుర్గత తల్లి దీవెనలు ఉండాలని వారు తెలిపారుఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మొండితోక సుధాకర్ రంగా హనుమంతరావు కోట కృష్ణ ఆదిమూలం వాసు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

## ఊళ్లోకి ఎందుకు వచ్చావు

చేవెళ్ల, అక్టోబర్ 22 (ప్రజాపాలన):ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్యే కాలే యాదయ్య కు నిరసన సెగ ఎదురైంది. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం మొయినాబాద్ మండలం నక్కలపల్లి గ్రామ ప్రజలు యువకులు ఎమ్మెల్యే కాలే యాదయ్యను సమస్యలపైన నిలదీశారు. 2014, 2018 ఎన్నికలలో గ్రామానికి ఇచ్చినటువంటి హామీలు నెరవేర్చకుండా, ఉల్లోకి ఎందుకు వచ్చావని,సమస్యలను పరిష్కరించకుండా ఏ ముఖం పెట్టుకొని ఊళ్ళోకి వచ్చావని నిలదీశారు.ఎమ్మెల్యే గోబ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ,నినదిస్తు వాగ్వాదానికి, తోపులాటకు దారితీసింది.గ్రామస్తులు సమస్యలపైన నిలదీయడంతో వెనుతిరిగి వెళ్లిపోయినా ఎమ్మెల్యే కాలే యాదయ్య..

# ఉందిగా మరో పార్టీ మనకైనా...

అందరికి గుర్తుండే శివలో సాంగ్... మార్చి పోతే సెప్టెంబర్ అంటూ సాంగ్... ఇప్పుడు పొలిటికల్ పార్టీ నేతలు అదే పాట పాడుతున్నారు. ఎన్నికల్లో అభ్యర్థులను ఎంపిక చేయడం పార్టీలకు పెద్ద తలనొప్పి వ్యవహారం. టికెట్ ఆశించే నేతలు ఎక్కువగా ఉండడం, సమర్థత, ఆర్థిక, సామాజిక బలాబలాల ప్రకారం ఆశావహులను వడపోసినా సరే.. చివరకు ఒక్కో సీటు కోసం ఇద్దరు ముగ్గురు నేతలు గట్టిగా పోటీపడుతున్న పరిస్థితులున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో టికెట్ ఆశించి భంగపడ్డ నేతలు తిరుగుబావుటా ఎగరేయడం కూడా రాజకీయాల్లో మనం చూస్తుంటాం. అలాంటి నేతలను తన్నుకుపోయి టికెట్ ఇచ్చేందుకు ఎదురుచూసే పార్టీలు కూడా మనకు తారసపడుతూనే ఉంటాయి.ఇప్పుడు ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఇలాంటి చిత్రాలెన్నో కనిపిస్తున్నాయి. ఈ పార్టీలో టికెట్ రాకపోతే.. ఆ పార్టీలో రెడీ అన్న చందంగా పరిస్థితి తయారైంది. షెడ్యూల్ కంటే ముందే కొన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఈ తరహా వాతావరణం నెలకొంది. అందులో భారతీయ జనతా పార్టీ రెండు విధాలా సవాళ్లను ఎదుర్కొంటోంది. ఓవైపు రెబెల్స్ బెడద.. మరోవైపు సుదీర్ఘకాలంగా సీఎం పీఠంపై ఉన్న శివరాజ్ సింగ్ చౌహాన్ ఎదుర్కొంటున్న సహజ వ్యతిరేకత.. ఆ పార్టీ విజయావకాశాలను దెబ్బతీసేలా కనిపిస్తున్నాయి.టికెట్ దొరకనివారిలో అసంతృప్తి సహజమే. ఆశించి భంగపడ్డవాళ్లు తిరుగుబాటు చేయడం కూడా సహజమే అని తేలిగ్గా తీసుకునే పరిస్థితి లేదు. ఆ తిరుగుబాటు ఖరీదు పార్టీ ఓటమి కూడా కావొచ్చు. అందుకే ప్రత్యర్థి పార్టీలో రెబెల్స్‌ను తమ పార్టీ అభ్యర్థులుగా నిలిపేందుకు కొన్ని పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. మధ్యప్రదేశ్‌లో ప్రస్తుతం ఇదే జరుగుతోంది. 230 స్థానాలున్న మధ్యప్రదేశ్ అసెంబ్లీకి జరుగుతున్న ఎన్నికలు రోజురోజుకు ఆసక్తికరంగా మారుతున్నాయి. 244 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించిన కాంగ్రెస్ ప్రస్తుతం అధికారంలో ఉన్న శివరాజ్ చౌహాన్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని చూస్తుండగా, రాష్ట్రంలో మరోసారి గెలుపొంది ప్రభుత్వాన్ని కొనసాగించాలని చూస్తున్న బీజేపీ ఇప్పటివరకు 236 పేర్లను ప్రకటించింది. నవంబర్ 27న ఈ రాష్ట్రంలో పోలింగ్ జరగనుంది.ఇంతలో, చాలా మంది ఆశావహులకు టిక్కెట్లు లభించకపోవడంతో తిరుగుబావుటా ఎగరేస్తున్నారు. బీజేపీ రెబల్స్ కొందరు కాంగ్రెస్ నుంచి టిక్కెట్లు పొందగలిగారు. మరికొందరు ఇంకెవరైనా పిలిచి టికెట్ ఇవ్వకపోతారా అని వేచి చూస్తున్నారు. రెబల్స్ బెడద కేవలం బీజేపీకి మాత్రమే లేదు. కాంగ్రెస్ సైతం ఇదే పరిస్థితి ఎదుర్కుంటోంది. రెండు పిల్లుల తగవులాటలో కోతి లాభపడ్డట్టు.. ఈ రెండు పార్టీల రెబెల్స్ మీద మాయావతికి చెందిన బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ), అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్నేశాయి. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల పార్టీల నుంచి 30 మంది వరకు రెబల్స్ స్వతంత్రులుగా బరిలోకి దిగారు. వారిలో నలుగురు గెలుపొందారు కూడా. మిగతావారిలో చాలా మంది గెలవకపోయినా.. అప్పటి వరకు బీజేపీ ? కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య ఉన్న పోటీని ముక్కోణపు పోటీగా మార్చి తమ పార్టీకి చెందిన అభ్యర్థుల ఓటమికి కారణమయ్యారు. అందుకే ఈ సారి రెండు పార్టీలూ రెబెల్స్ అంశాన్ని తేలిగ్గా తీసుకోవడం లేదు.గతానుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈసారి ఎంత జాగ్రత్తగా కసరత్తు చేసినా సరే.. ఇప్పటి వరకు ప్రకటించిన జాబితాలోనే బీజేపీ, కాంగ్రెస్ రెండు పార్టీల నుంచి 22 మంది తిరుగుబాటు నేతల పేర్లు తెరపైకి వచ్చాయి. వారిలో 25 మంది బీజేపీ రెబల్స్ కాగా.. అందులో 5 మందికి కాంగ్రెస్ టిక్కెట్లు దక్కాయి. మిగతావారిలో కొందరు నేతలు స్వతంత్రులుగా ఎన్నికల్లో పోటీ చేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్‌లో చేరిన ప్రముఖ బీజేపీ తిరుగుబాటు నేతల్లో దతియా నుండి అవధేష్ నాయక్, ముంగవాలి నుండి రావ్ యద్వేంద్ర సింగ్ ఉన్నారు.టికెట్ దక్కలేదన్న కారణంతో నేతలు అటు బీజేపీని, ఇటు కాంగ్రెస్ పార్టీని వీడి బయటికొచ్చేందుకు సిద్ధపడుతుండడంతో వారిని బహుజన్ సమాజ్ పార్టీ ఎర్రతివాచీ పరిచి స్వాగతిస్తోంది. తిరుగుబాటు నేతల సొంత ఓటుబ్యాంకుకు బీఎస్పీ ఓటుబ్యాంకు తోడైతే ఫలితాలు తారుమారైనా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. రాష్ట్రమంతటా బీఎస్పీకి గెలిచేంత ఓటుబ్యాంకు లేకపోయినా? గణనీయమైన ఓట్ల శాతాన్ని ఆ పార్టీ పొందగల్గుతోంది. ఆ పార్టీకి రాష్ట్రవ్యాప్తంగా సగటున 5-6 శాతం ఓటుబ్యాంకు ఉండగా.. కొన్ని కొన్ని నియోజకవర్గాల్లో అది గరిష్టంగా 20 శాతం వరకు ఉంది. ఈ పరిస్థితుల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల తిరుగుబాటు నేతలు బీఎస్పీకి అస్త్రాలుగా మారతారని ఆ పార్టీ భావిస్తోంది. ఇన్నేళ్లుగా బీజేపీ-కాంగ్రెస్ మధ్య ముఖాముఖి పోరులా కనిపిస్తున్న ఎన్నికలను తిరుగుబాటు నేతలకు బీఎస్పీ టికెట్లు ఇవ్వడం ద్వారా ముక్కోణపు పోటీగా మార్చేలా కనిపిస్తోంది. గతంలో మాదిరిగా ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాని పక్షంలో బీఎస్పీ లాభపడే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.కాంగ్రెస్‌లో ఆశించిన ప్రాధాన్యత దక్కడం లేదన్న ఉద్దేశంతో ఆ పార్టీని వీడి, తనతో పాటు మరికొందరిని తీసుకుని 2020లో బీజేపీలో చేరిన జ్యోతిరాదిత్య సింధియాపై అందరి దృష్టి ఉంది. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన కమలదళం తరఫున రంగంలోకి దిగనున్నట్టు కథనాలు వినిపిస్తున్నాయి. అయితే ఇప్పటి వరకు విడుదల చేసిన జాబితాల్లో 2వ జాబితాలో బీజేపీ ఏకంగా ముగ్గురు కేంద్ర మంత్రులు, నలుగురు ఎంపీలను అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దింపినప్పటికీ.. సింధియా పేరు మాత్రం లేదు. కైలాష్ విజయవర్గీయ అసెంబ్లీ ఎన్నికల్లోకి ప్రవేశించడంతో సింధియా రాష్ట్ర రాజకీయాల్లో ఉండకపోవచ్చన్న కథనాలు కూడా మరోవైపు వినిపిస్తున్నాయి. తనకు విధేయుడిగా ఉంటూ కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరిన ఎమ్మెల్యేలకు టిక్కెట్లు ఇవ్వాలని సింధియా బీజేపీ అధినేతలను కోరుతున్నారు. మధ్యప్రదేశ్‌లో కమల్‌నాథ్ నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారును కూల్చి బీజేపీ సర్కారు ఏర్పడ్డానికి సహకరించిన సింధియాను సంతృప్తి పరిచేందుకు బీజేపీ తన అభ్యర్థుల్లో కొంతమందిని త్యాగం చేయక తప్పడం లేదు.ఎన్నికల ప్రచారపర్వంతో మిగతా పార్టీల కంటే ముందుండాలన్న ఉద్దేశంతో భారతీయ జనతా పార్టీ అభ్యర్థుల తొలి జాబితాను ముందుగానే ప్రకటించి తప్పుచేసిందా అన్న ప్రశ్న ఇప్పుడు తలెత్తుతోంది. తొలి జాబితాలో అనేక స్థానాల్లో ప్రస్తుతం ఆ పార్టీ తిరుగుబాటును ఎదుర్కోవాల్సి వస్తోంది. తొలి జాబితాలో చోటు దక్కించుకోలేకపోయినా నేతలు తమ భవిష్యత్తు కార్యాచరణ నిర్ణయించుకోడానికి కావాల్సినంత సమయం దొరికింది. తిరుగుబావుటా ఎగరేయడం కారణంగా కొందరికి కాంగ్రెస్ పార్టీ పిలిచి టికెట్లు ఇచ్చింది. మరికొందరు బీఎస్పీలో చేరిపోయారు. మొత్తంగా తిరుగుబాటుదారులు గెలిచినా.. గెలవకున్నా.. బీజేపీ గెలుపు అవకాశాలను మాత్రం దారుణంగా దెబ్బతీసే అవకాశం ఉంది. అదే కమలనాథుల్లో ఆందోళన కల్గిస్తోంది.

## రాష్ట్రఅధిష్ఠానం నిర్ణయంతో తెలుగుదేశం పార్టీ పోటీకి సిద్ధం



మధిర అక్టోబర్ 22 ప్రజా పాలన ప్రతినిధి ఈరోజు హైదరాబాదులోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవనం నందు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అధ్యక్షతన తెలుగుదేశం రాష్ట్రపార్టీ సమావేశం జరిగింది రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలలో టిడిపి పోటీ చేస్తుందని మాట్లాడుతూ ప్రకటించారు . తెలుగుదేశం పార్టీ ఎన్నికల పోటీలో ఉండబోవటలేదనే మోసపూరిత ప్రచారాన్ని కాసాని ఖండించారు ,టిడిపి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. తెలుగుదేశం పార్టీ సత్తాని చాటాలని అని అన్నారు, తద్వారా తెలంగాణలో టిడిపి పార్టీ బలోపేతం చేయాలని అన్నారు. ఆయా నియోజకవర్గాల నుండి పోటీ చేయు అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించి అభ్యర్థులను త్వరలో ప్రకటన చేస్తామని కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు నాయకులలో మధిర నియోజకవర్గము నుండి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఖమ్మం పార్లమెంటు అధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం గారు, రాష్ట్ర నాయకులు చేకూరు శేఖర్ బాబు, మల్లాది హనుమంతరావు, మార్నీడి పుల్లారావు,దోమందుల సామేలుగూడూరు వెంకటేశ్వర రెడ్డి ,జిల్లా కమిటీ గురజాల సత్యనారాయణ కొర్లపాటి శ్రీనివాస రావు చాట్ల బాబురావు ఎర్రమల కిషోర్ రెడ్డి దోమందల ఎలిజిబెత్ పాల్గొన్నారు.

## మహిళా సంక్షేమానికి పెద్దపీట

**చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి భీం భారత్**
**పార్టీ మహిళా ప్రెసిడెంట్ సమతా వెంకట్‌రెడ్డి బర్త్‌డేకు హాజరు..**



చేవెళ్ల అక్టోబర్ 22(ప్రజాపాలన): కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తామని చేవెళ్ల అభ్యర్థి భీం భారత్ హామీ ఇచ్చారు. ఆదివారం చేవెళ్ల మోడల్ కాలనీలో నిర్వహించిన పార్టీ మండల అధ్యక్షురాలు దేవరి సమతా వెంకట్‌రెడ్డి జన్మదిన వేడుకలకు ఆయన సతీమణి జ్యోతి భీం భారత్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సమతా వెంకట్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు నెలకు రూ.2500, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో పాటు రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని చెప్పారు. తర్వాత దుర్గాభవానీ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల గ్రామ సర్పంచ్ శైలజా ఆగిరెడ్డి, ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ గోనె ప్రతాప్ రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు పెంటారెడ్డి, ముడిమ్యాల మాజీ సర్పంచ్ ప్రభాకర్, చేవెళ్ల మాజీ ఉప సర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్, నరెడ్లగూడ మాజీ సర్పంచ్ రవి, నేతలు నర్సింలు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## హస్తం ఆశావాహుల గుండెల్లో రైళ్లు..

(మొదటి పేజీ తరువాయి)

మక్తల్: మక్తల్ నియోజకవర్గంలోనూ కాంగ్రెస్ ఆశావహుల లిస్ట్ పెద్దదిగా ఉంది. నారాయణపేట జిల్లా డీసీసీ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే కె.వీరారెడ్డి కుమారుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి టికెట్ కోసం పోటీ పడుతున్నారు. అలాగే దివంగత మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్‌రెడ్డి సతీమణి లేదా తనయుడు సిద్దార్థ్ రెడ్డి టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

దేవరకద్ర: హస్తం పార్టీ టికెట్ కోసం స్థానికంగా పోటీ హీట్ పెంచుతోంది. మహబూబ్ నగర్ డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ప్రదీప్ కుమార్ గౌడ్, ప్రశాంత్ రెడ్డి టికెట్ కోసం హస్తిన వరకు వెళ్లి ప్రయత్నాలు చేశారు. ఇక మధుసూదన్‌రెడ్డి నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం సైతం నిర్వహిస్తున్నారు.

కమింగ్ సూన్% ఏ క్షణమైనా కాంగ్రెస్ అభ్యర్థుల రెండో జాబితా వచ్చే చాన్సుంది.. ఢిల్లీలో చర్చలు భీకరంగా కొనసాగుతున్నాయి. మొత్తంగా ఈ ఆరు నియోజకవర్గాల్లో టిక్కెట్ వస్తుందనే నమ్మకంతో నాయకులు అప్పడే పల్లెల్లో ప్రచారం చేస్తున్నారు. అధిష్ఠానం మాత్రం అవకాశం ఎవరికి వస్తుందనే అంశంపై సస్పెన్షన్ కొనసాగిస్తోంది.

## దసరా తర్వాత దూకుడుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తాం



హైదరాబాద్: దసరా తర్వాత దూకుడుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తామని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఆదివారం నాడు ఆయన బీజేపీ ప్రధాన కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.."ఈనెల 27వ తేదీన తెలంగాణలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా బహిరంగ సభ ఉంటుంది. 31వ తేదీన యూపీ సీఎం యోగీ తెలంగాణలో ప్రచారం నిర్వహిస్తారు. 28,29 తేదీలల్లో తెలంగాణకు అస్సోం సీఎం హిమంత బిశ్వ శర్మ వస్తారు. రాష్టంలో బీఆర్ఎస్ ప్రభుత్వ వ్యతిరేక వాతావరణాన్ని బీజేపీకి అనుకూలంగా మార్చుకుంటాం. ఈసారి ఎన్నికల్లో బలమైన అభ్యర్థులకే టికెట్లు ఇచ్చాం. దసరా తర్వాత బీజేపీ రెండో జాబితాను ప్రకటిస్తాం" అని కిషన్‌రెడ్డి ప్రకటించారు.

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

## సంపాదకీయం

**సోమవారం 23,అక్టోబరు 2023**

## వెలుగులీనుతుండగా అంధయుగమెందుకు?

భారతదేశ చరిత్రలో సుమారు పన్నెండు వందల సంవత్సరాలు అంధయుగంగా చెపుతున్నారు. ఆ కాలం చరిత్ర తెలియడం లేదని భావం. కాని ప్రాచీన వ్మాయాన్ని గమనిస్తే ఇలా అంధయుగమని చెప్పవలసిన అవసరం లేదని తెలుస్తోంది. వ్యాసమహర్షి తండ్రి పరాశరుడు. ఆయన చెప్పిన విష్ణుపురాణం విషయ ప్రధానంగా ఉంటుంది. వర్ణనల వలన కలిగే విస్తరం దానిలో ఉండదు. ఇది మనకు చరిత్ర లభించే కాలానికి ముందునాటి మూడువేల సంవత్సరాలకు పైగా చరిత్రను చెబుతోంది.పురాణానికి ప్రధానంగా అయిదు లక్షణాలు ఉంటాయి. సర్గ, ప్రతిసర్గ, వంశం, మన్వంతరాలు, వంశానుచరితం. పురాణంలో విస్తృతంగా ఉండేవి దేశ పాలకుల వంశాలు, ఆ వంశాలలో బయలుదేరిన మహానుభావుల చరిత్రలు. పురాణాలను సూతులు చెప్పేవారు. వీరు రథాలు కూడా నడిపేవారు. పూర్వం పరిపాలకులకు వందులు, మాగధులు, సూతులు ఉండేవారు. వందులు ఆ పాలకుడు చేసిన ఘనకార్యాలు చెప్పేవాడు. మాగధులు అతని వంశంలోని గొప్పవారి గురించి చెప్పేవారు. సూతులు ఇతర రాజవంశాల గురించి చెప్పేవారు. విష్ణుపురాణంలో సూర్యవంశం, చంద్రవంశం, మగధవంశం మొదలయిన అనేక పాలక వంశాల గురించి ఉంది. మగధ వంశంలో జరాసంధుడు చాలా శక్తిమంతుడు, అతని తండ్రి బృహద్రథుడు. కాబట్టి ఇతని వంశం వారిని బార్హద్రథులు అంటారు. బృహద్రథునితో కలిపి ఈ వంశం వారు 23 మంది పాలించారు. జరాసంధుడు భీముని చేతిలో మరణించాడు. ఈ 23 మంది పేర్లు విష్ణుపురాణంలో ఉన్నాయి. వీరిలో చివరివాడు రిపుంజయుడు. ఇతని మంత్రి మునికుడు. అతడు రిపుంజయుని చంపి తన కొడుకు ప్రద్యోతుని సింహాసనంపై కూర్చోబెట్టాడు. ప్రద్యోత వంశం వారు అయిదుగురు. వీరి తరువాత శిశునాభ వంశం వారు పాలకులయ్యారు. వీరు పదిమంది. వీరిలో చివరివాడు మహానంది. ఈ మూడు వంశాల వారు 1050 సంవత్సరాలు పాలించారు. ఆ మహానందికి శూద్రస్త్రీ యందు జన్మించినవాడు మహాపద్ముడు. ఇతనిని నందుడని కూడా అంటారు. ఇతని కుమారులు సుమాల్యుడు మొదలగువారు ఎనమండుగురు. మహాపద్ముడు మొదలుకొని పరిపాలకులు శూద్రులు. మహాపద్ముని, అతని సంతానాన్ని కలిపి నవనందులు అంటారు. వీరు నూటొక్క సంవత్సరాలు పరిపాలకులు. కౌటిల్యుడు ఈ వంశాన్ని సంహరింపజేసి చంద్రగుప్త మౌర్యునికి పట్టాభిషేకం చేశాడు. ఈ వంశం వారు పదిమంది. 137 సంవత్సరాలు పాలించారు. వీరిలో చివరివాడైన బృహద్రథుని అతని సేనాపతి పుష్యమిత్రుడు చంపి ప్రభువయ్యాడు. వీరిది శుంగ వంశం. ఈ వంశం వారు 110 సంవత్సరాలు పాలించారు.తరువాత కణ్వ వంశం వారు పాలకులయ్యారు. వీరు నలుగురు 45 సంవత్సరాలు పాలించారు. ఈ వంశంలో చివరివాడైన సుశర్మను అతని భృత్యుడు ఆంధ్రజాతీయుడు బలి పుచ్ఛకుడు చంపి తాను రాజయ్యాడు. బలిపుచ్ఛకుడి వంశానికి చెందిన పాతికమంది 456 సంవత్సరాలు పాలించారు. బృహద్రథుని దగ్గర నుంచి ఆంధ్రులలో చివరివాడైన సులోమాపి వరకు పాలకుల పేర్లను విష్ణుపురాణంలో పేర్కొన్నారు, వారి పాలనా కాలాన్నీ చెప్పారు.ఆంధ్రభృత్యులు, ఆభీరులు మొదలయిన వారు ఏడుగురు, గర్దభులు 10 మంది, యవనులు ఎనమండుగురు, తురుష్కులు 14 మంది, ముండులు 13 మంది, మౌనులు 11 మంది మొత్తంగా 1090 సంవత్సరాలు పాలించారు. వీరిలో మౌనులు పాలించిన కాలం 300 సంవత్సరాలు. తరువాత కైంకిలులు, యవనులు ప్రభువులయ్యారు. వీరికి పట్టాభిషేకాలు లేవు. వీరి సంతానం వింధ్యశక్తి, పురంజయుడు, రామచంద్రుడు, ధర్మవర్మ, నందనుడు, సునంది, నంది యశుడు, శుక్రుడు, ప్రవీరుడు 106 సంవత్సరాలు పాలకులు. వీరి కుమారులు 13 మంది. బాహ్లికులు ముగ్గురు, పుష్యమిత్రులు, పటుమిత్రులు, ఏకలులు ఏడుగురు, కోసల యందు ఆంధ్రులు ఏడుగురు పాలించారు. వీరే నైషధులు. విశ్వస్ఫాటికుడు అనే నాయకుడు కైవర్తులను, పటువులను, పుళిందులను, బ్రాహ్మణులను ప్రభువులుగా చేశాడు. పద్మావతీపురంలో తొమ్మిదిమంది నాగులు పరిపాలన చేశారు. గయ, గుప్తరాజ్యం, గంగాతీరం, ప్రయాగలను మాగధులు పాలించారు. కళ్గి, మహిష, మహేంద్ర, భౌమ దేశాలను గుహులు పాలించారు. నైషధ, నైమిషిక, కాలక, శక జనపదాలను మణిధాన్యక వంశం వారు, త్రైరాజ్య మూషిక జనపదాలను కనకులు, సౌరాష్ట్ర, అవంతి, శూద్ర, ఆభీర దేశాలనూ, నర్మద, మరుభూమి దేశాలనూ వ్రాత్య, ద్విజ, ఆభీర శూద్రులు పాలించారు. సినుతట, దావికోర్య, చంద్రభాగ, కాశ్మీర దేశాలను వ్రాత్య మ్లేచ్ఛ శూద్రాదులు పాలించారు. వీరంతా ఏకకాలంలో వేరు వేరు భూభాగాలను పాలించేవారు. పైన పేర్కొన్న వారిలో బృహద్రథుడు మొదలుకొని 39 మంది క్షత్రియులు పాలించారు. వారందరి పేర్ల జాబితాలున్నాయి. మహాపద్ముడు మొదలుకొని 57 మంది పాలించారు. వీరందరి పేర్లూ ఉన్నాయి. వీరిలో నవనందులు, చంద్రగుప్త మౌర్యుని నుంచి బృహద్రథుని వరకు గల పదిమందీ శూద్ర ప్రభువులు. తరువాత శుంగులు పదిమంది, కాణ్వులు నలుగురు, ఆంధ్రరాజు బలి పుచ్ఛకుడు మొదలైన 25 మంది. వీరిలో చివరివాడు సులోమాపికి ముందున్నవాడు చంద్రశ్రీ. ఇతని దగ్గర చంద్రగుప్తుడు, సముద్రగుప్తుడు ఉండేవారు. ఈ చంద్రగుప్తుడు అలెగ్జాండరుతో మాట్లాడినవాడు. కానీ, భారతదేశ చరిత్రలో మౌర్యచంద్రగుప్తుడినీ, చంద్రశ్రీ దగ్గర ఉన్న చంద్రగుప్తుడినీ ఒకరిగానే లెక్కించారు. దీనివల్ల వీరిద్దరికీ నడుమ ఉన్న 48 మంది పాలనాకాలం అదృశ్యమయింది. ఈ కాలమంతా అంధయుగంలో చేరింది.బృహద్రథుని నుంచి 107 మంది పరిపాలకుల పేర్లు లభిస్తున్నాయి. వీరిలో అజాతశత్రువు, ఉదయనుడు, నవనందులు, చంద్రగుప్త మౌర్యుడు, బిందుసారుడు, అశోకవర్ధనుడు, శాతకర్ణి, పుష్యమిత్రుడు మొదలయిన వ్యక్తుల పేర్లు, కాణ్వులు, శుంగులు, ఆంధ్రభృత్యులు మొదలయిన గణనామాలు ఉన్నాయి. వ్యక్తులు కాకుండా వంశాలు, గణాల పేర్లు కూడా మనకీ గ్రంథంలో ఉన్నాయి. జరాసంధుని నుంచి ఈ పాలకుల పరిపాలనా కాలాలు, పరిపాలక వంశాల పాలనాకాలం కలిపితే సుమారు 3397 సంవత్సరాలు వస్తున్నాయి. గణాల పాలనాకాలం దీనికి అదనం. దీని తరువాత చరిత్ర మనకు లభిస్తున్నదే. ఐదువేల సంవత్సరాల కంటె ఎక్కువ కాలం నుండి లభిస్తున్న ఈ గ్రంథాన్ని ఎందరు రాశారో! కాబట్టి దీనిలో అక్షరదోషాలు, లేఖకుల భ్రమ ప్రమాదాలు లేవనలేము. అయినా వంశాలు, వంశానుచరితాలు పరంపరగా చెప్పడమే వృత్తిగా కలిగిన సూతుల నుండి లభించిన గ్రంథం కనుక లభించే మిగిలిన ప్రమాణాలతో సమన్వయించి వీటిని గ్రహించాలి. ఈ విషయంలో పరిశోధన జరిపి ఎక్కువ గ్రంథాలు ఏకీభవిస్తున్న విషయాలను గ్రహించాలి. 107 మంది పాలకులు, వారి పాలనాకాలం లభిస్తూండగా ఇంకా అంధయుగం ఎందుకు? సుమారుగా ఈ కాలాన్ని గుర్తించడానికి విష్ణుపురాణంలోనే మరో ఖగోళాధారం కూడా ఇచ్చారు. సప్తర్షుల చుక్కలలో మొదట ఉండే ఇద్దరి మధ్య ఒక నక్షత్రం అర్ధరాత్రి కనబడుతుంది. సప్తర్షులు ఆ నక్షత్రంలో నూరు సంవత్సరాలుంటారు. పరీక్షిత్తు కాలంలో సప్తర్షులు మఖానక్షత్రంలో ఉన్నారు (విష్ణు. 4.24-105, 106 శ్లో). ఇప్పుడు వేధశాల ద్వారా సప్తర్షులు ఏ నక్షత్రంలో ఉన్నారో గుర్తిస్తే పరీక్షిత్తు కాలం స్పష్టంగా తెలుస్తుంది.

## మీవూరిపుడెలా వుంది? వెలమల రాజ్యం మళ్లీ కావాలా?

ఆసక్తిగా ఒక మిత్రుడు అడిగాడు . మీ జగిత్యాల ప్రాంతంలో ముప్పయ్యేళ్లకు ఇప్పటికి ఏమేం మార్పులు వచ్చాయి? ఉద్యమాలు చూశారు, చేశారు. మీ అవగాహన అధ్యయనం ప్రజల పరిశీలన తిరిగి చేయాలి. మిగతా ప్రపంచం కన్న ఏ మేరకు భిన్నంగా ప్రగతిశీలం గా చైతన్యవంతంగా జీవిస్తున్నారు? ప్రజలను కలిసి గమనించి చెప్పండి అని అడిగాడు. దసరా సెలవుల్లో సొంతూరు పోదాం అనుకున్న సందర్భంగా వేసిన ప్రశ్నలివి. ఆ దృష్టితో జగిత్యాల లో కలిసిన వారిని తెలిసిన వారిని దూరంగా గమనించి వారిని చూసాను. గమనించాను. ఈ సందర్భంగా ఒక మాట చెప్పాలి. ఒక ముఖ్యమైన విషయం. ఇది మరిచి పోయి పాత భావాల్లో పడి పోతున్నాము. 1967 లో సాగిన నక్సల్బరీ లో ఇపుడు ఉద్యమం లేదు. ఉద్యమ ఆనవాళ్లు లేవు. అదొక పేరు మాత్రమే. అదొక సింబల్ మాత్రమే. 1969 లో సాగిన శ్రీకాకుళంలో జరిగిన ఇపుడు ఉద్యమం లేదు. దాని ఆన వాల్లు లేవు. అది ఒక సింబల్ మాత్రమే. 1977 నుండి జగిత్యాల , ఉత్తర తెలంగాణా లో నడిచిన ఉద్యమం ఇపుడు లేదు. దాని ఆన వాల్లు కూడా లేవు. అదొక సింబల్ మాత్రమే. అదొక జ్ఞాపకం మాత్రమే. ఇలా ఎందుకైంది? ఎందుకైందంటే 1986 నుండి 1989 దాకా నాలుగైదేళ్లు ఉత్తర తెలంగాణ ఉద్యమం ఎన్టీఆర్ ప్రభుత్వం నిర్బంధాల వల్ల వెనక్కి తగ్గారు. దండకారణ్యం, బెంగాల్ బిహార్ యుపి, చత్తీస్ గడ్ ప్రాంతాలకు ఉద్యమ నాయకులు కార్యకర్తలు తరలిపోయారు. 1989 చివరలో కాంగ్రెస్ గెలిచి, గెలిపించాక... డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అనేక సభలు అమరవీరుల స్థూపాల నిర్మాణం జరిగాయి. నేదురుమిల్లి జనార్దన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక నిర్బంధాలు పెంచారు. ఆ తరువాత 1996 నుండి మలి తెలంగాణ రాష్ట్ర ఉద్యమం మొదలైంది. 36 సంగాలు ఏర్పడ్డాయి. 2001 నుండి టీ ఆర్ ఎస్ ముందుకు వచ్చింది. సామాజిక తెలంగాణ , ప్రజాస్వామ్య తెలంగాణ, బహుజన తెలంగాణ నినాదాలు వెనక్కి పోయి భౌతిక తెలంగాణ నినాదం ముందుకు వచ్చింది. బొంబాయి దుబాయి బొగ్గుబాయి, ఉచిత కరెంటు , మన ఉద్యోగాలు మనకే, మన నీళ్లు మనకే అనే నినాదాలు ముందుకు వచ్చాయి. టిడిపి చంద్రబాబు నాయుడు , వైయస్ రాజశేఖరరెడ్డి ప్రయోగించిన నిర్బంధాలు ఇన్ని అన్ని కావు. తెలంగాణ ఉద్యమాన్ని రక్తపుటేరుల్లో ముంచారు. క్రమేణా ఎన్నికలు రాజీనామా లు, ఉప ఎన్నికలు, తెలంగాణ ధూమ్ ధాములు, సకల పార్టీలు, సకల సిద్ధాంతాలు, సకల కులాల ఏకైక నినాదం గా తెలంగాణ రాష్ట్ర సాధన ముందుకు వచ్చి బహుజనవాదం దళిత వాదం స్త్రీ వాదం, విప్లవ వాదం, సామాజిక న్యాయం, అనేవి వెనక్కి నెట్టి వేయ బడ్డాయి. తెలంగాణ ఆవిర్భావం తరువాత టి ఆర్ ఎస్ అధికారంలోకి వచ్చింది. అన్ని ఉద్యోగాల కన్నా పోలీసు శాఖ ఉద్యోగాలను నియమించడంతో జరిగింది. తెలంగాణ సరిహద్దులు దాటి వెల్లిన ఉద్యమకారులు తిరిగి చెట్టుకు రాకుండా పకడ్బందీగా ఏర్పాట్లు జరిగాయి. మత ఘర్షణలు, విప్లవ సంఘర్షణలు లేకుండా చూసారు. చేశారు. ఇంటలిజెన్సు కౌంటర్ ఇంటలిజెన్స్ సివిల్ పోలీస్ శాఖలు తమ పని చేసుకుపోయాయి.ఇపుడు ఉత్తర తెలంగాణ లో విప్లవ ఉద్యమ ఆనవాళ్లు లేవు. సాధించుకున్న భూములు ధరణి ప్రోగ్రాములో భూమి మీద అనుభవదారు, కౌలు దారు వంటి కాలమ్ము తొలగించడం వల్ల ఆ భూములు ప్రభుత్వ భూములుగా, భూస్వాముల భూమలుగా రికార్డులు మార్చబడ్డాయి. కంప, రాల్లు బొగడలు సరిచేసి పంటభూములుగా మార్చుతున్న భూములు వారివి కాకుండా పోయాయి. రైతు బంధు , ధరణి ద్వారా బేదఖలు చేయబడి భూస్వాముల భూములుగా ప్రభుత్వ భూములుగా మార్చ బడ్డాయి. ఎన్నో త్యాగాలు ఉద్యమాలతో సాధించుతున్న భూములు ధరణి ప్రోగ్రాముది పాత పద్ధతి కాలమ్ము తొలగించడం వల్ల కౌలుదారులకు రైతుబంధ నిరాకరించడా వల్ల ఇది జరిగింది. నోరు లేని మూగ ప్రజలు బాధపడుతున్నారు. ఉద్యమాలు లేవు. వారిని సంఘటిత పరిచే నాయకత్వం లేదు. నిశ్శబ్దంగా రోదిస్తున్నారు. ఆనాడు 40 ఏళ్ల క్రితం 5 వేలకు ఎకరం ఉన్నపుడు సాగుచేసుకని బాగుచేసుకున్న భూమి 20 లక్షలకు ఎకరం అయ్యాక బేదఖలు చేయబడ్డారు. బీఆర్ ఎస్ ఓడిపోతే బహుశా వీరి కారణంగానే ఓడిపోతుంది. అదే జరిగితే జగిత్యాల , ఉత్ప్రేక్ష తెలంగాణ ఉద్యమాల చైతన్యం నిప్పు ఆరి పోకుండా కొనసాగుతున్నదని అర్థం చేసుకోవాలి. బీఆర్ ఎస్ గెలిస్తే విప్లవించిన ప్రజలు భూస్థాపితం అయ్యారు , చేరబడ్డారు, మద్యానికి, ఆసరా పథకాలకు, తాయిలాలకు బానిసలయ్యారని అనుకోవచ్చు. ప్రస్తుత పరిస్థితి మాత్రం గత దశాబ్దాల్లో సాధించిన ఫలితాలు చైతన్యం హల్లుకి హల్లు సున్నకు సున్న శూన్యంగా కనపడుతున్నది. ఉద్యమాల నిర్బంధాలవల్ల గల్ఫ్ బాట పట్టిన దారి అలానే సాగుతున్నది. చేసిందేమా చేతికి అందకుండా పోయింది. 1996 నుండి 25 ఏళ్ల లో తరాలు ఎదిగాయి. వారికి ఆనాటి ఉద్యమాల గురించి తెలియదు. వారికి మిగిలింది శూన్యం. విప్లవ చైతన్యం నిత్యజీవితం గెలుచుకోవడానికి పనికి వస్తుందా అనేదొక ప్రశ్న! నిత్యజీవితంలో పనికి వచ్చేదైతే మెంట్ పెల్లి లో మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్ రావు బీజేపీ తరఫున ఏమ్మెల్లేగా, ఎంపీ గా ఎలా గెలుస్తాడు అనే ఎదురు ప్రశ్న మొదటి నుండే వుంది. అందువల్ల ప్రజలది చైతన్యం కాకపోవాలి. అనగా లేని చైతన్యం ప్రజల్లో ఉన్నట్టు ప్రచారం జరిగి వుండాలి. అపుడే లేని చైతన్యం తరాలు గడిచిన తరువాత ఇప్పుడు ఉంటుందని , ఉండాలని ఆశించడం అత్యాశే. పైగా టీవీలు, సెల్ ఫోన్లు, వాట్సాప్ లు, యూ ట్యూబ్ చానెల్ లు ఎక్కడిక్కడ విస్తరించి చొచ్చుకు పోయాక ఏది మిగిలింది ? ఏమి. మిగిలింది? వేల కోట్లు వసూలు చేసి ప్రింటు వ్యాప్తంగా చరిత్ర సబుప్టించిన బాహుబలి, దెంగాలి వంటివే కొద్ది కాలానికే ప్రభావం కోల్పోతున్న సమాచార సాంకేతిక వేగవంతమైన యుగం లో ఎప్పటిదో ఇంకా ఎండిన పిడుకల వలె మిగిలి ఉంటదనుకునుడు భ్రమ. నక్సబరీ ఆదివాసులు పేరుకు లేకుండా పోయారు. కూలి నీలి చేసుకొంటూ కోల్ కతాలోనో మరోచోటనో బతుకుతున్నారు. శ్రీకాకుళం లో ఉద్యమించిన ప్రజలు బాధలు భరించ లేక రాజ్ నంద్ గాం, భిలాయి ప్రాంతాలకు కిరిండలి రైల్వే లైనులో వెల్లి రిక్షాలు లాగి బతుకుతున్నారు. ఉత్తర తెలంగాణ ప్రజలు బాధలు నిర్బందాలు భరించ లేక ముంబాయి. గల్ఫ్ బాట పట్టి కూలి నీలి పని చేసుకుంటున్నారు. 35 లక్షలమంది గల్ఫ్ పోయి రావడం జరిగి నేటికీ 15 లక్షలమంది అట్లనే పనిచేస్తున్నారు. వారిని పట్టించుకునేది ఎవరు? ఇలా చైతన్యం మోడువారిపోయింది. ఏమో ఎవరు చెప్పగలరు? తెలంగాణ పేరిట తిరిగి అధికారంలోకి వచ్చిన వెలమల రాజ్యాన్ని ఓడించి ప్రజలుతమ చైతన్యాన్ని మళ్లీ ప్రదర్శిస్తరేమో ఎవరు చెప్ప గలరు? అదే జరిగితే అంతకన్నా సంతోషించాల్సిందేముంటుంది?

**బి ఎస్ రాములు**

## శ్రామిక మహిళకు కూర్చునే హక్కు!

రాష్ట్రంలో పండుగ సీజన్ మొదలైంది. అక్టోబర్‌లో దసరాతో మొదలై...నవంబర్‌లో దీపావళి, డిసెంబర్‌లో క్రిస్మస్, జనవరిలో సంక్రాంతితో ముగుస్తుంది. ఈ నాలుగు నెలలు ఆఫర్లతో, డిస్కౌంట్లతో మోత మోగించేస్తున్నారు. భారీ షాపింగ్ మాల్స్‌లో వ్యాపారాలు జోరుగా సాగిపోతున్న కాలమిది. ధమాకా ఆఫర్లతో, చిరునవ్వుతో కస్టమర్లకు వంగి, వంగి నమస్కారాలు చేస్తూ, ఆహ్వానాలు పలికే శ్రామిక మహిళలు మనకు కనిపిస్తుంటారు. ఆ రంగు, రంగుల దీపకాంతుల వెనుక, ఆ నవ్వుల వెనుక ఎంతటి విషాదం ఉందో తెలిస్తే మనసున్న వారెవరికైనా హృదయాలు బరువెక్కక మానవు. ఊరంతా పండుగే, దేశమంతా పండుగల సంబరాలే కానీ ఆ మాల్స్‌లో పని చేసే సగటు మహిళలు...పండుగ రోజుల్లో కుటుంబంతో కలిసి భోంచేసి ఏళ్లయిందని చమర్చిన కళ్లతో వివరిస్తారు. పండుగలన్నవి మరచిపోయామని వారు వివరిస్తారు.



**ఎవరు వీరు? వీరి కష్టమేంటి!?**

తోడేళ్లలాగా తనిఖీ చేసే సూపర్‌వైజర్లు, యాజమాన్యపు సిబ్బంది నిఘా మధ్య కుక్కిన పేనుల్లా పనులు చేసుకుపోయే శ్రామిక మహిళల్ని షాపింగ్ మాల్స్, బట్టల షాపులు, పెద్ద పెద్ద సూపర్ మార్కెట్లలో చూస్తుంటాం. ఈ మహిళలు ఎప్పుడు మనం షాపింగ్‌కు వెళ్లినా నిలబడుకునే కనిపిస్తారు. పక్కన కనీసం కూర్చోవడానికి స్టూలుకానీ, కుర్చీ కానీ కనపడదు. ఇవేవీ మనకు పట్టదు. ఉదయం 9 గంటలకు డ్యూటీకి వచ్చింది మొదలు రాత్రి 9 గంటలకు డ్యూటీ దిగేంత వరకు సుమారు 12 గంటల పాటు కంటిన్యూగా నిలబడే ఉండాల్సిన ఉద్యోగం వారిది. ఇప్పటికైనా అర్థం అయిందా? వారి కష్టం ఏమిటో? మహిళలు షాపింగ్‌మాల్స్‌లో కూర్చునే హక్కును కల్పిస్తూ దేశంలో మొట్టమొదటిసారిగా కేరళ రాష్ట్ర ప్రభుత్వం చట్టం తెచ్చింది. ఆ తరువాత తమిళనాడు ప్రభుత్వం కూర్చునే హక్కును కల్పిస్తూ చట్టం చేసింది. కేరళ చట్టంలో ప్రతి కార్మికునికి వారానికి ఒకరోజు సెలవుదినంగా ఇవ్వాలని, మహిళా కార్మికులను రాత్రి 9 నుంచి ఉదయం 6 గంటల వరకు పని చేయించరాదని పేర్కొన్నది. తప్పనిసరి పరిస్థితులు ఎదురైనప్పుడు ఐదుగురు కార్మికులు ఓ గ్రూపుగా ఉండాలి. అందులో ఇద్దరు మహిళలు ఉండాలి. వారికి తగిన రక్షణ కల్పించాలి. ఇంటి వరకూ రవాణా సౌకర్యం కల్పించాలని చెప్పబడింది. షాపుల్లో నిలబడి పని చేసే వారికి వారి పని ప్రదేశాలలో కూర్చోవటానికి సౌకర్యం కల్పించాలని స్పష్టంగా చట్టంలో వివరించబడింది. మన రెండు తెలుగు రాష్ట్రాలలో ఇది హక్కుగా, చట్టంగా లేకపోవడం విచారకరం. తక్షణం ఈ సమస్యపై రెండు ప్రభుత్వాలు చట్టం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.మారుతున్న జీవన సరళి, నూతన ఆర్థిక విధానాల ప్రభావం, ప్రజల్లో పెరుగుతున్న వినియోగదారీ తత్వం కారణంగా పెద్ద నగరాలకు పరిమితమైన షాపింగ్‌మాల్స్ చిన్న పట్టణాలకు సైతం వ్యాపిస్తున్నాయి. ఈ రంగంలో చదువుకున్న వారి సంఖ్య ఎక్కువగా ఉన్నది. గ్రామీణ ప్రాంతాల నుంచి వలస వచ్చి ఈ పనులలో అత్యధికులు చేరుతున్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో రిలయన్స్, డీ-మార్ట్, సిటీమార్ట్, బిగ్ బజార్, బ్రాండ్ ఫ్యాక్టరీ, శుభమస్తు, సౌత్ ఇండియా షాపింగ్ మాల్, ఎంజిఆర్, పసుపర్తి, చందనా బ్రదర్స్, చందన రమేష్, అపూర్వ, కళానికేతన్, కంచి పెరుమాళ్ సిల్క్స్, సిఎంఆర్ వంటి షాపింగ్ మాల్స్‌తో పాటు పలు జ్యూవెలరీ మార్టులున్నాయి. వందల సంఖ్యలో మాల్స్, పెద్ద సంఖ్యలో ఇతర సంస్థలు పోటీ పడి ముందుకు వస్తున్నాయి. వేల నుంచి లక్షల సంఖ్యలో శ్రామికులు వీటిలో ఉపాధికై పని చేస్తున్నారు. వీరికి కార్మిక చట్టాలు అమలు కావడం లేదు. ప్రభుత్వం నిర్ణయించిన వేతనాలు ఇవ్వటం లేదు. గంటలకొద్దీ నిలబడటం వల్ల ఆరోగ్య సమస్యలు పెరిగిపోతున్నాయి. అత్యధిక చోట్ల మహిళలకు కూర్చునే సౌకర్యం లేదు. కస్టమర్లు లేనప్పుడు కూడా కూర్చునేందుకు లేదు. తిరుపతి నగరంలో సిఐటియు కార్యకర్తల పరిశీలనలో దిగ్భ్రాంతికరమైన వాస్తవాలు వెల్లడయ్యాయి. ఈ మహిళలకు నిలబడి ఉండటం కారణంగా మూత్రాశయ వ్యాధులు, కాళ్లపై వెరికోస్ వెయిన్స్ (నరాలు ఉబ్బటం) వ్యాధి, వెన్నుపూస, నడుమునొప్పి వంటి సమస్యలు చిన్న వయసులోనే వస్తున్నాయి.శుభమస్తు షాపింగ్ మాల్స్‌లో 10 నిమిషాలు మాత్రమే వాష్‌రూమ్‌కు వెళ్లాలనే నిబంధన ఉంది. బాత్‌రూమ్‌కు వెళ్లిన ప్రతిసారి బయోమెట్రిక్‌లో నమోదు చేయాలి. చందనలో కస్టమర్లు లిఫ్ట్‌లో వస్తారు. కార్మికులు లిఫ్ట్ ఎక్కడానికి వీలు లేదు. ఎన్ని సార్లయినా, ఎన్ని అంతస్తులైనా మెట్లపై నడవాల్సిందే. పీరియడ్స్ సమయంలో మహిళల బాధ వర్ణనాతీతంగా ఉంటుంది. కార్మికులకు భోజనాలు చేయడానికి సౌకర్యాలు లేవు. టాప్‌ఫ్లోర్‌లో వాష్‌రూముల దగ్గర భోజనాలు చేస్తుంటారు. వంటరి మహిళలు, పెళ్లికానివారు, ఇంటిని పట్టించుకోని భర్తలున్న మహిళలు అనివార్యమై కుటుంబ భారాన్ని మోస్తున్నట్టుగా ఈ సర్వేలో వెల్లడైంది. పిల్లల రక్షణ, వారి భవిష్యత్తుపై వీరికి తీవ్ర ఆందోళన ఉంది. కుటుంబానికి సమయం ఇవ్వలేక పోతున్నామన్న బాధ వీరిలో కనిపిస్తుంది. ఇక ఒంటరి మహిళల బాధ చెప్పనలవి కాదు. పిల్లలు ఎలా పెరుగుతున్నారో పరిశీలన చేసే అవకాశం తమకు లేదని వాపోతున్నారు.మహిళలకు, పురుషులకు వేతన వ్యత్యాసం ఉంది. ఎన్నేళ్లయినా ఒకే రకమైన పనులు చేయాలి. దీంతో మనుషులు యాంత్రికం గా తయారవుతున్నారు. ప్రమోషన్లు లేవు. వర్కర్లతోపాటు ఈ రంగంలో హెల్పర్లు పని చేస్తున్నారు. వీరికున్న సమస్యలు వర్కర్ల కంటే ఎక్కువగా ఉన్నాయి. పని ఎక్కువ, వేతనం తక్కువ. కొనుగోలుదార్లు చూసిన బట్టలు, వస్తువులను సర్దటమే వీరి ప్రధాన పని. రూ.6 వేల నుంచి 14 వేల వరకు వేతనాలు చెల్లిస్తున్నారు. పెద్ద మాల్స్‌లో కనీస వేతనం, ఇఎస్ఐ, పిఎఫ్‌లు అమలు చేస్తున్నా పని గంటలు చట్ట ప్రకారం అమలు చేయటం లేదు. కార్మికులకు ప్రోత్సాహకాలు, బోనస్ పేరుతో పోటీ పెంచుతున్నారు. ఒక్కో అంతస్తులో ప్రతి రోజూ 'మంచి ఉద్యోగి' పేరిట ఎంపిక చేస్తారు. ఇందుకోసం అమ్మకాలు పెంచాలంటూ విపరీత మైన టార్చర్ ఉంటుంది. తెలుగు రాష్ట్రాలలో ఎక్కడా 8 గంటల పని విధానం అమలు కావటం లేదు. 10 నుంచి 12 గంటలపాటు కనీసంగా వీరు పని చేయాల్సి వస్తున్నది. దూర ప్రాంతాల నుంచి వచ్చేవారు రోజులో రాక పోకలు కలుపుకుంటే 14 నుంచి 16 గంటలు ఈ పనిలో ఉండాల్సి వస్తున్నది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సెలవులు అమలు కావటం లేదు. ఒక్కరోజు సెలవు తీసుకుంటే రెండు రోజుల వేతనాన్ని కత్తిరిస్తున్నారు.కేరళ, తమిళనాడు తరువాత దేశంలో ఎక్కడా ఇది చట్టంగా రూపుదాల్చలేదు. మహిళోద్ధారకులుగా తమను తాము కీర్తించుకునే జగన్, కేసిఆర్‌లకు ఈ సమస్య పట్టడంలేదు. విజయవాడ, విశాఖ, తిరుపతి, రాజమండ్రి, కాకినాడ లాంటి నగరాలలో వీరి సంఖ్య వేలల్లో ఉంటుంది. ఒక్కో ప్రాంగణంలో వేయి నుంచి రెండు వేల మంది పని చేస్తున్న సంస్థలు కూడా ఉన్నాయి. రాష్ట్రంలో లక్షల సంఖ్య లో శ్రామిక మహిళలు పని చేస్తున్న ఇంత పెద్ద వ్యవస్థలో చట్టాలు అమలవుతున్నాయా? లేదా? అన్న ప్రాథమిక పరిశీలన కూడా ప్రభుత్వాలు చేయకపోవటాన్ని ఓ నేరంగా భావించాలి. ఓ రకంగా చెప్పాలంటే ఇందులో పని చేస్తున్న మహిళల కనీస హక్కులు హరించబడుతున్నాయి.పని ప్రదేశంలో లైంగిక వేధింపుల సమస్య కూడా తీవ్రమైన అంశంగా ఉంది. 2013 లైంగిక వేధింపుల నిరోధక చట్టం అనుసరించి మాల్స్‌లో ఎక్కడా అంతర్గత కమిటీలు లేవన్న వాస్తవం ఈ పరిశీలనలో వెల్లడైంది. తక్షణం ఉభయ రాష్ట్రాల తెలుగు ప్రభుత్వాలు ఎన్నికల తరుణంలోనైనా వీరి సమస్యలకు పరిష్కారాన్ని చూపించాల్సిన బాధ్యత ఉంది.

# నిర్మల్ లో ట్రయాంగిల్ ఫైట్

అదిలాబాద్, అక్టోబరు 22, :అసెంబ్లీ ఎన్నికల వేళ నిర్మల్ రాజకీయం ఆసక్తికరంగా సాగుతోంది. ప్రధాన పార్టీల తరపున బలమైన అభ్యర్థులు నిలుస్తుండటంతో? త్రిముఖ పోటీ తప్పేలా లేదని అంటున్నారు విశ్లేషకులు. రాష్ట్రంలో ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. నిర్మల్ నియోజక వర్గం ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోటగా ఉండేది, ప్రస్తుతం గత 2024 నుండి బీఆర్ఎస్ పార్టీ హవా కొనసాగుతోంది. ఇది ఇలా ఉంటే నిర్మల్ నియోజవర్గంలో ఈసారి పోటీలో నిలబడే వివిధ పార్టీల అభ్యర్థులు ప్రస్తుతం టిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే అల్లోల ఇంద్రకరణ్ రెడ్డికి అనుచరులు కావడం విశేషం, 2952లో ఏర్పడిన ఈ నియోజకవర్గంలో ఇప్పటికి ఆరుసార్లు కాంగ్రెస్ పార్టీ, ఐదు సార్లు తెలుగుదేశం పార్టీ, ఒక్కొక్కసారి ప్రజారాజ్యం పార్టీ, భారతీయ జనతా పార్టీ, భోజన సమాజ్ పార్టీ, ఇండిపెండెంట్ పార్టీ సైతం గెలుపొందాయి. ప్రస్తుతం టిఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి నిర్మల్ నియోజవర్గంలో నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలుపొందడానికి రాజకీయ వ్యూహాలు రచిస్తున్నారు.నిర్మల్ నియోజవర్గంలో ఇప్పటికే ప్రధాన పార్టీ అభ్యర్థుల పేర్లను ప్రకటించేసింది. బిఆర్ఎస్ పార్టీ నుంచి సెట్టింగ్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, బిజెపి పార్టీ నుండి మహేశ్వర్ రెడ్డి ఖరారు కానున్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ నుంచి కూచాడి శ్రీహరి రావు లు పోటీ చేస్తున్నారు. ముగ్గురు ప్రముఖ నేతలు కావడంతో ఈసారి గెలుపు ఎవరిని వరిస్తుందో నని ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు. అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి నాలుగు సార్లుగా ఎమ్మెల్యేగా గెలిచి ఐదోసారి అసెంబ్లీలో అడుగు పెట్టాలని చూస్తున్నారు, బీఎస్పీ పార్టీ నుంచి పోటీ చేసి టిఆర్ఎస్ ప్రభుత్వంలో చేరి మంత్రి పదవిని కైవసం చేసుకున్నారు. రెండుసార్లు రాష్ట్రంలో దేవాదాయ శాఖ మంత్రిగా కొనసాగారు. తాను నియోజవర్గంలో చేసిన అభివృద్ధి, టిఆర్ఎస్ పార్టీ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు తప్పకుండా గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఉద్యమం నుంచి తెలంగాణ వచ్చేవరకు బీఆర్ఎస్ పార్టీ లో కొనసాగుతూ వస్తున్న మంత్రి అనుచరుడు కూచాడి శ్రీహరి రావు ఇటీవల కాంగ్రెస్ లో చేరారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రంగంలోకి దిగారు, గత తొమ్మిది సంవత్సరాల కాలంగా మంత్రి అనుచరులుగా కొనసాగిన శ్రీహరి రావు పార్టీలో విభేదాలు తలెత్తడంతో టిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. రెండుసార్లు టిఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓడిపోయరు. ఈసారి కాంగ్రెస్ పార్టీ నుంచి రంగంలోకి దిగి గెలుస్తానని భీమా వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా భారతీయ జనతా పార్టీ నుంచి ఏలేటి మహేష్ రెడ్డి పోటీలో ఉన్నారు. గతంలో ప్రజారాజ్యం పార్టీ నుంచి నిర్మల్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. తెలంగాణలో ప్రజారాజ్యం పార్టీకి రెండు సీట్లు దక్కగా, అందులో ఒకటి నిర్మల్ నియోజకవర్గం కావడం విశేషం. అంతటి ఆదరణ ఉన్న ఏలేటి మహేశ్వర్ రెడ్డి అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరారు, గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి సిట్టింగ్ ఎమ్మెల్యే ఇంద్రకరణ్ రెడ్డి పై స్వల్ప మెజారిటీ తొమ్మిది వేల ఓట్ల తో ఓడిపోయారు. కాంగ్రెస్ పార్టీలో పిసిసి రేవంత్ రెడ్డికి , మహేశ్వర్ రెడ్డి కి మధ్య పడి రాకపోవడంతో పార్టీకి రాజీనామా చేసి బిజెపి పార్టీలో చేరారు. ప్రస్తుతం బిజెపి పార్టీ నుంచి నిర్మల్ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు.గతంలో జరిగిన ఎన్నికలలో నిర్మల్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి కూచాడి శ్రీహరి రావు, ఏలేటి మహేశ్వర్ రెడ్డిలు ఓడిపోయారు. అయితే ఈసారి పార్టీ కండువాలు మార్చుకొని ప్రజల సానుభూతి ఓట్లు తమకే పడతాయని ఇద్దరూ ఆశలు ఉన్నారు. అయితే సాధారణ ప్రజలు ఏ పార్టీ కి పట్టం కడుతారో వేచి చూడాల్సి ఉంది, ఇరు పార్టీల నాయకులు ఇటీవలే పార్టీలు మారడంతో సాధారణ ప్రజలు తికమక పడుతున్నారు. తమ నాయకులు ఏ పార్టీలో కొనసాగుతున్నారో తెలియకుండా ఉందని చర్చించుకుంటున్నారు. గత రెండు నెలల క్రితం వరకు ఒకరు కాంగ్రెస్ మరొకరు టిఆర్ఎస్ పార్టీలో కొనసాగారు. ఇటీవలే పార్టీ కండువాలు మార్చుకొని బీ ఆర్ ఎస్ నుండి కాంగ్రెస్లోకి కూచాడి శ్రీహరి రావు, కాంగ్రెస్ నుంచి బిజెపిలోకి మహేశ్వర్ రెడ్డి పార్టీలు మారారు. దీంతో ప్రజల్లోకి వెళ్లి ప్రచారం చేయడానికి తీవ్రంగా కృషి చేస్తున్నారు.




# గులాబీ గూటికి ఉద్యమకారులు




హైదరాబాద్, అక్టోబరు 22, :తెలంగాణ ఉద్యమకారుడిగా అందరికి సుపరిచితమైన డాక్టర్ చెరుకు సుధాకర్ కాంగ్రెస్ ను వీడనున్నారు. తిరిగి బీఆర్ఎస్ లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. రేపోమాపో ఆయన? సొంత గూటికి చేరటం ఖాయంగానే కనిపిస్తోంది. తెలంగాణ ఉద్యమ కారులు ఒక్కొక్కరే తిరిగి తమ ఉద్యమాలకు వేదికనిచ్చిన భారత రాష్ట్ర సమితి ( అప్పటి తెలంగాణ రాష్ట్ర సమితి ) గూటికి చేరుకుంటున్నారు. గడిచిన పది పదిహేనేళ్లుగా గులాబీ పార్టీకి దూరంగా ఉన్న ఈ నాయకులు ఆయా పార్టీలో తమ లక్ ను పరీక్షించుకుని విఫలమై సొంత గూడుకు చేరుతున్నారు. తెలంగాణ ఉద్యమ నాయకుడు జిట్టా బాలక్రిష్ణారెడ్డి హైదరాబాద్ తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటి మంత్రి కె.తారక రామారావు (కేటీఆర్) సమక్షంలో తన అనుయాయులతో కలిసి గులాబీ కండువాలు కప్పుకున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా భువనగిరికి చెందిన జిట్టా బాలక్రిష్ణారెడ్డి కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్లో చేరిపోయారు. ఇపుడు ఉమ్మడి నల్లగొండ జిల్లా, నకిరేకల్ నియోజకవర్గానికే చెందిన మరో సీనియర్ నాయకుడు డాక్టర్ చెరుకు సుధాకర్ వంతు వచ్చింది. ఆయన కూడా రేపోమాపో గులాబీ కండువా కప్పుకోవడమే మిగిలింది.డాక్టర్ చెరుకు సుధాకర్ 2024 ఎన్నికల సమయానికి ముందే ఒక విధంగా బీఆర్ఎస్ కు దూరమయ్యారు. ఆ సమయంలో ఆయన అప్పటి టీఆర్ఎస్ పోలిట్ బ్యూరో సభ్యునిగా కూడా ఉన్నారు. నకిరేకల్ నియోజకవర్గంలో తనను కాదని, అప్పుడప్పుడే పార్టీలో చేరిన వేముల వీరేశానికి నియోజకవర్గ ఇన్ చార్జ బాధ్యతలు అప్పజెప్పండతో డాక్టర్ చెరుకు సుధాకర్ అలక బూనారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లో కూడా టికెట్ దక్కలేదు. దీంతో పార్టీకి రాజీనామా చేసి తెలంగాణ ఉద్యమ కారుల వేదిక ఏర్పాటు చేసి పనిచేశారు. ఆ తర్వాత కొన్నాళ్లకు తెలంగాణ ఇంటి పార్టీకి పురుడు పోశారు. గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీకి జరిగిన ఎన్నికల్లోనూ ఆయన పోటీ చేశారు. చివకు తన పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేశారు.కొన్నాళ్ళుగా కాంగ్రెస్ పార్టీలో ఉన్నా.. భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డితో ఆయనకు పొసగలేదు. ఇద్దరి మధ్య వివాదం కూడా జరిగింది. అయితే, టీపీసీసీ నేత రేవంత్ రెడ్డి డాక్టర్ చెరుకు సుధాకర్ ను వెనకేసుకొచ్చినా.. ఈ ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి సైతం కోమటిరెడ్డితో సయోధ్య చేసుకున్నారని చెబుతున్నారు. జిల్లా కాంగ్రెస్ నాయకత్వం చెరుకు సుధాకర్ కు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వక పోవడం, కనీస గుర్తింపు కూడా లేకపోవడాన్ని ఆయన జీర్ణించుకోలేక పోతున్నారు. ఉదయ్ పూర్ డిక్లరేషన్ ప్రకారం ప్రతీ లోక్ సభ నియోజకవర్గంలో రెండు అసెంబ్లీ స్థానాలు బీసీలకు కేటాయించాల్సి ఉంది. కానీ, జిల్లాలో ఇప్పటికి ఒక్క ఆలేరు మాత్రమే కేటాయించారు. మరో స్థానాన్ని కేటాయిస్తారన్న నమ్మకం కూడా లేకపోవడం, తనకు ఎక్కడా అవకాశం కూడా దక్కే సూచనలు లేకపోవడం, పార్టీలో చెప్పుకోదగిన బాధ్యతలు లేకపోవడం వంటి అంశాలపై తర్జనభర్జనల తర్వాత కాంగ్రెస్ ను వీడాలన్న నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.పార్టీలో ఉన్నప్పటి నుంచి డాక్టర్ చెరుకు సుధాకర్ కు మంత్రి హరీష్ రావుతో మంచి సంబంధాలే ఉన్నాయి. తెలంగాణ ఉద్యమకారులనంతా తిరిగి పార్టీలోకి తీసుకువచ్చే బాధ్యతల్లో భాగంగా మంత్రి హరీష్ రావు, కాంగ్రెస్ లో కుదురుకోలేక పోతున్న డాక్టర్ చెరుకు సుధాకర్ ను సంప్రదించి ఒప్పించినట్లు తెలుస్తోంది. “ కనీసం నా సీనియారిటీని, అనుభవాన్ని పార్టీ కోసం ఉపయోగించుకునే తెలివి కాంగ్రెస్ నాయకత్వానికి లేదు. ఇక్కడ బయట పార్టీలో ఉండి ఏం కొట్లాడగలం. అందుకు సొంత పార్టీలో ఉంటే మేలన్న అభిప్రాయానికి వచ్చిన. అక్కడ కనీస గౌరవమైనా దక్కుతుంది.

## యూటర్న్ తీసుకున్న బీఆర్ఎస్ అసంతృప్త కౌన్సిలర్లు




కామారెడ్డి: కామారెడ్డిలో బీఆర్ఎస్ పార్టీ అసంతృప్త కౌన్సిలర్లు యూటర్న్ తీసుకున్నారు. మున్సిపల్ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు ఎన్నికల ఇన్చార్జ్ శేరి సుభాష్రెడ్డితో అసంతృప్త కౌన్సిలర్స్ సమావేశమయ్యారు. చాలా రోజులుగా అంతర్గతంగా నలిగిపోతూ అవమానాలకు, వివక్షకు గురవుతున్నామని కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్టీ మారేది లేదని అసంతృప్తి కౌన్సిలర్స్ తెలిపారు. స్పష్టమైన హామీతో కేసీఆర్ని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని అసంతృప్త కౌన్సిలర్లు తెలిపారు.

## శంకరపట్నంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



శంకరపట్నం అక్టోబర్ 22 ప్రజాపాలన రిపోర్టర్: శంకరపట్నం మండల కేంద్రంలో స్థానిక వ్యవసాయ మార్కెట్లో సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకొని ఆదివారం మహిళలంతా ఒక్క చోట చేరి ఎంతో ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలను భక్తిశ్రద్ధలతో గౌరీ దేవికి పూజలు నిర్వహించి వారి వారి బతుకమ్మలను ఒక్కచోట చేర్చి వాటి చుట్టూ ప్రదక్షణగా తిరుగుతూ మహిళలు యువతులు చప్పట్లతో, కోలలతో ఆడుతూ ఎంతో ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు.

# కుంగిన వంతెనపై అధికారుల విచారణ..




జయశంకర్ భూపాలపల్లి : కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ లక్ష్మీబ్యారేజీ వంతెన కుంగడంపై అధికారులు విచారణ చేపట్టారు. 19, 20, 21 పిల్లర్లు కుంగినట్టు నిర్ధారించారు. నిర్మాణ లోపమా?, మరేదైన కారణమా? ఉందా అన్నది అధికారులు తెలుసుకుంటున్నారు. వంతెన కుంగిన విషయాన్ని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. ఏబీఎన్ కథనాన్ని ఉటంకిస్తూ హైకోర్టు చీఫ్ జస్టిస్కు ప్రముఖ న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ లేఖ రాశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో లోపాన్ని వివరిస్తూ ఆయన లేఖ రాశారు.కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో మేడిగడ్డ వద్ద నిర్మించిన లక్ష్మీ బ్యారేజీ అంతర్ రాష్ట్ర వంతెన శనివారం రాత్రి కుంగిపోయింది. బ్యారేజీ బీ–బ్లాక్లో 19, 20, 21వ పిల్లర్ల మధ్య ఉన్న వంతెన సుమారు 30 మీటర్ల పొడవున.. ఒక ఫీటు వరకు కిందికి కుంగింది. అయితే వంతెన కింద ఉన్న బ్యారేజీ పిల్లర్లు భూమిలోకి కుంగడం వల్ల వంతెన కూడా కుంగిందా? లేక బ్యారేజీ గేట్లు, వంతెన మధ్య ఉండే సిమెంట్, ఐరన్ బీమ్ల మ?ధ్య ఏదైనా లోపం వల్ల కుంగిందా? లేక వంతెన స్లాబ్ కుంగిపోయిందా? అనేది స్పష్టంగా తెలియడం లేదని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. 20వ నెంబరు పిల్లర్ కొద్దిగా కుంగిందని మాత్రం ఓ అధికారి తెలిపారు. మేడిగడ్డ బ్యారేజీని 2016 మే 2వ తేదీ నిర్మాణం చేపట్టగా.. 2019 జూన్ 21న దీనిని ప్రారంభించారు. ఎల్అండ్టీ సంస్థ నిర్మించిన ఈ బ్రిడ్జి పైనుంచే మహారాష్ట్రలోని సిరోంచ జిల్లాకు రాకపోకలు కొనసాగుతున్నాయి. వాస్తవానికి నిర్మాణ దశలోనే బ్యారేజీలోని 20వ నెంబరు పిల్లర్ వద్ద పగుళ్లు వచ్చాయని, అప్పట్లో దానికి మరమ్మతులు చేసి పని పూర్తి చేశారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే వంతెనపై చీకటి ఉండటంతో.. కుంగడం వెనుక కారణాలేంటన్నది అంతు చిక్కకుండా ఉంది. మేడిగడ్డ బ్యారేజీ నిల్వ సామర్థ్యం 16.17 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 10.100 టీఎంసీల నీరు నిల్వ ఉంది. శనివారం సాయంత్రం నుంచి 8 గేట్ల ద్వారా 14,930 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అయితే రాత్రివేళ మహారాష్ట్రకు వెళుతున్న వాహనదారులు వంతెన కుంగిపోయిన విషయాన్ని గుర్తించి బయటకు చెప్పడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. మరికొన్ని గేట్లను కూడా ఎత్తి బ్యారేజీలో నీటిని విడుదల చేస్తున్నారు. ఆదివారం వరకు బ్యారేజీలో నీటిని పూర్తిగా ఖాళీ చేసి, సంబంధిత నిపుణులతో వంతెన కుంగడానికి గల కారణాలను పరిశీలించనున్నట్లు పేర్కొంటున్నారు.

వంతెన పైనుంచి రాకపోకల నిలిపివేత..

వంతెన కుంగిన విషయం తెలియడంతో మహదేవపూర్ పోలీసులు వంతెన పైనుంచి రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. బ్యారేజీకి ఇరువైపులా బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. వాహనాలను కాళేశ్వరం సమీపంలోని అంతర్రాష్ట్ర వంతెన మీదుగా వెళ్లేలా దారి మళ్లించారు. లక్ష్మీ బ్యారేజీ ఈఈ తిరుపతిరావు వంతెన కుంగిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఆదివారం ఉదయం ఇంజనీరింగ్ నిపుణులు వచ్చాకే ఘటనపై స్పష్టత వస్తుందని చెప్పారు. అయితే బ్యారేజీకి మహారాష్ట్ర వైపున శనివారం సాయంత్రం పేలుడు సంభవించిన శబ్దం వచ్చిందని, ఆ తరువాతే బ్యారేజీ కుంగిందని అధికార పార్టీకి చెందిన వెబ్సైట్ పేర్కొంది. ఇందులో ఏదైనా కుట్ర కోణం ఉందా? అన్న అనుమానాలు కూడా ఉన్నట్లు తెలిపింది. ఇదిలా ఉండగా.. కాళేశ్వరం ప్రాజెక్టులో ఇంతకుముందు కూడా పలు ఘటనలు చోటుచేసుకోవడం గమనార్హం. 2020 జూలై 9న భూపాలపల్లి జిల్లాలోని గ్రావిటీ కెనాల్ గోడ సిమెంట్ బిచ్చులు ఊడిపోయాయి. అనంతరం 2022 జూలై 14న గోదావరిలో వచ్చిన భారీ వరదలకు కాళేశ్వరం సమీపంలోని లక్ష్మీ పంప్హౌస్ నీట మునిగింది. ఈ సంఘటనలో 17 మోటర్లు నీట మునిగిపోగా, వీటిలో 7 మోటార్లు దెబ్బతిన్నాయి.



















# దసరా అంటేనే.. సరదాలు.. సందళ్లు...

పల్లెలనూ.. పట్టణాలనూ ఏకం చేసే అతి పెద్ద పండగల్లో దసరా ఒకటి. యాంత్రిక జీవనానికి కాస్త విరామమిచ్చి, సొంతూళ్లకు వెళ్లే ఆనవాయితీ నేటికీ కొనసాగుతోంది. ఈ కొద్దిరోజులైనా ఊరికి, ఊళ్లోని మనుషులకు దగ్గరగా గడిపే అవకాశం కల్పిస్తోంది. ఊళ్లోని తాతయ్య, నాన్నమ్మ, అమ్మమ్మ, అత్త, పెద్దమ్మ, చిన్నమ్మ.. ఇలా ఎన్నో పిలుపులకు, వారి మమకారానికి పిల్లలను దగ్గర చేసేది ఈ పండగ సెలవులే. అనుబంధాలను పెంచే, ఉమ్మడితనాన్ని పెంచే అరుదైన పండగ ఇది. కొత్త కొత్త స్నేహాలు, పరిచయాలకు ఇది ఓ ఆలంబన. సరదాలు .. సందళ్లు.. సందేశాలు.. సందోహాలు.. ఇవ్వన్ని కలిస్తేనే పండగ. వాటన్నింటి కలబోతే దసరా. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం...

పొట్టలోనున్న నాటి నుంచి బిడ్డకే కాదు..
విశ్వమంతటికీ ప్రేమను పంచిందీ..
లోక కంటకులను దునుమాడిందీ మాతృమూర్తులే!

సింధు నాగరికత నుంచీ ఎన్నో గురుతులు నేటికీ మన సంస్కృతిలో, జీవనంలో పెనవేసుకున్నాయి. మాతృస్వామ్య వ్యవస్థ నాటి జ్ఞాపకాలు దేశమంతా, ప్రపంచమంతా అనునిత్యం మనకు తారసపడుతూనే ఉంటాయి. ప్రకృతిని ఆరాధించే.. మాతృమూర్తిని జగన్మాతగా కొలిచే పండగ దసరా. అంతులేని ప్రేమకూ.. వాత్సల్యానికీ నెలవు తల్లి.. తన బిడ్డలు లోక రక్షకులు కావాలని కోరుకుంటుంది. వారే లోక కంటకులైతే.. సన్మార్గంలో పెట్టే సర్వ ప్రయత్నాలు విఫలమైతే.. రౌద్రమూర్తిగా మారి, సంహరిస్తుందని చాటిచెప్పే పండగ దసరా. అందుకు ప్రతీకగా జరుపుకుంటున్న ఉత్సవాలే దసరా సందళ్లు. ఈ సందర్భంగా తూర్పు, ఈశాన్య భారతంలో దుర్గా దేవిని పూజిస్తే, దక్షిణభారత రాష్ట్రాల్లో స్త్రీ దేవతలను కొలుస్తారు. ఉత్తర, పశ్చిమ రాష్ట్రాల్లో రాముడు రావణుడిని సంహరించిన పురాణ కథను ఉటంకిస్తూ, 'రామలీల'గా జరుపుకుంటారు.

దసరా పండగ సందర్భం అందరికీ ఒకటే అయినా, అది ఒక్కోచోట ఒక్కో పద్ధతిలో జరుగుతుంది. పండగ నేపథ్యం, నిర్వహించే పద్ధతి ప్రచారంలో ఉన్న కథలూ...ఒక్కోచోట ఒక్కోలా ధ్వనిస్తాయి, దర్శనమిస్తాయి. భిన్నత్వంలో ఏకత్వం అన్న సూత్రం ఈ పండగలోనూ ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

జమ్మిచెట్టు ప్రత్యేకత..

ఈ ఉత్సవాల్లో మరో ప్రత్యేకత జమ్మి చెట్టు. ముళ్లకంపలాంటి.. కొండవాలుల్లో పెరిగే శమీ చెట్టును పూజించడం ప్రకృతితో మమేకమవడమే కదా! రామరావణ యుద్ధానికి ముందు రాముడు, అరణ్యవాసం పూర్తయ్యాక పాండవులు తమ ఆయుధాలను మూటకట్టి ఈ చెట్టుపై ఉంచి, ఈ చెట్టును పూజించారనే కథలున్నాయి. ఈ చెట్టుబెరడుతో చేసే కషాయం దగ్గు, ఉబ్బసం వ్యాధులను తగ్గించి ఆరోగ్యాన్ని, తద్వారా శుభాల్ని ఇస్తుంది. అధిక జీర్ణశక్తిని కలిగిస్తుంది. జమ్మి ఆకును తెలంగాణ ప్రాంతంలో బంగారమని పిలుస్తారు. ఈ పండగ నాడు పెద్దలకు, ఆత్మీయులకు ఈ జమ్మి బంగారాన్ని ఇచ్చి ఆశీస్సులు అందుకోవడం ఆనవాయితీ.

మాతృమూర్తికి వందనం..

ఈ పండగ ప్రత్యేకత అమ్మని పూజించడమే కాదు.. తన పుట్టుకకు, జీవితానికి ఆలంబనగా నిలిచే మాతృమూర్తులందరినీ గౌరవించడం.

'అమ్మలగన్న యమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ, చా బె
ద్దమ్మ సురారులమ్మ కడుపాఱడి వుచ్చిన యమ్మ తన్నులో
నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడి యమ్మ, దుర్గ,
మా
య్య కృపాబ్ధియిచ్చుత మహత్త్వ కవిత్వ పటుత్వ సంపదల్'

అంటూ కవిత్వంలోని గొప్పదనాన్ని, పటుత్వాన్ని తన కృపతో ప్రసాదించేది అమ్మేనంటూ బమ్మెర పోతన తన భాగవత రచనా సందర్భంలో గుర్తు చేసుకున్నారు. నేటికీ దసరా సందర్భంలో ఈ పద్యం వినిపిస్తూనే ఉంటుంది.

పిల్లల సందడి..

పిల్లలు బాగా సందడి చేస్తూ సంబరపడే పండగ దసరా. ఒకప్పుడు తమ బడుల్లో చదివే పిల్లలను వెంటబెట్టుకుని గ్రామంలో ఇంటింటికీ వెళ్లేవారు. పిల్లలు కొత్తబట్టలు వేసుకుని, చేతుల్లో విల్లంబులు పట్టుకుని వచ్చేవారు. ఈ విలును గిలక అంటారు. వీటిని సంధించి వదిలితే, ఎదుటి వారిమీద పూలూ ఆకులు పడేవి. పిల్లలు అలా ఊరంతా తిరుగుతూ 'జయీభవ జయవిజయీభవ దిగ్విజయీభవ' అంటూ దసరా పాటలు, పద్యాలు పాడేవారు. వీటినే దసరా పద్యాలు, పాటలు అనేవారు.

'అయ్యవారికి చాలు అయిదు వరహాలు
పిల్లవాళ్లకు చాలు పప్పు బెల్లాలు.. అని వివరిస్తూ..
'ఏదయా మీదయా మామీద లేదు
ఇంతసేపుంచుట ఇది మీకు తగునా'.. అని దబాయిస్తూ..
పావలా బేడయితే పట్టేది లేదు
అర్ధరూపాయయితే అంటేది లేదు.
హెచ్చు రూపాయిస్తే పుచ్చుకుంటాము..' అని తేల్చి చెప్పేస్తారు..

అన్నీ సర్కారు బడులే ఉన్న ఒకప్పటి కాలంలో.. ఇలా సందడి సందడిగా.. వీధుల్లో పిల్లల, ఉపాధ్యాయుల హడావిడి సాగేది. గ్రామాలతో, ప్రజలతో వారంతా మమేకమైన తీరును ఇది ప్రతిబింబిస్తుంది.

బొమ్మల కొలువులు..

దసరా నవరాత్రుల్లో బొమ్మల కొలువులు మరో ప్రత్యేకత. దేవతా మూర్తులు, పక్షులు, జంతువులు, గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించే రకరకాల బొమ్మలను కొలువు తీరుస్తారు. ఈ కొలువులో తప్పనిసరిగా ఓ ముత్తయిదువ, షావుకారు, ఆవు, దూడ బొమ్మలు పెడతారు. బొమ్మల కొలువులను పన్నెండేళ్లలోపు పిల్లలతో అందంగా అలకరింపజేయడం, ఇరుగుపొరుగు వారిని పిలవడం ఆనవాయితీ. ఇతరులతో స్నేహ సంబంధాలు, ఇచ్చి పుచ్చుకునే ఆరోగ్యకరమైన ధోరణి పిల్లలకు అలవాటు చేయడానికి ఈ బొమ్మల కొలువు దోహదపడుతుంది.

ఓ బొమ్మల కొలువు పాటలోని ఓ చరణం.

'చిట్టిబొమ్మల పెండ్లి చేసేను జ్ఞానాంబ
చిత్రముగ చూడరమ్మ
మట్టి మీరిన లోకమంతా బొమ్మలు జేసి
నిట్టముగా లక్ష్మీదేవి వియ్యామందే..'
అంటూ సాగుతుంది.

తమిళనాడులోనూ బొమ్మల కొలువులు ఏర్పాటు చేస్తారు. మధుర మీనాక్షి ఆలయంలో పెట్టే పెద్ద బొమ్మల కొలువు చాలా ప్రసిద్ధి. తమిళనాడులోని కులశేఖర పట్టణంలో దసరాకు ఓ ప్రత్యేకత ఉంది. అక్కడ అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చేవారు పులి, కోతి, భిక్షగాడు, రాజు, రాక్షసుడు... ఇలా రకరకాల వేషాలు వేస్తారు. 'ప్రతి రూపంలోనూ దేవుడు ఉంటాడు' అని చెప్పడం దీని ఉద్దేశమట. వందేళ్ల చరిత్ర ఉన్న ఈ వేడుకలను వీక్షించేందుకు ఇతర రాష్ట్రాల నుంచి లక్షల సంఖ్యలో ప్రజలు వస్తారు.



బతుకమ్మ..

దసరా నవరాత్రుల్లో చేసే బతుకమ్మ పండగ తెలంగాణాకు ఓ తలమానికం. మహిళలు అత్యంత ఆనందంగా జరుపుకునే ఈ బతుకమ్మ పండగలో అనేక వైవిధ్యాలు కనిపిస్తాయి. పిల్లల దగ్గర నుంచి వృద్ధుల వరకూ కొత్త బట్టలు, పట్టు చీరలు కట్టుకుని బతుకమ్మల చుట్టూ తిరుగుతూ, చప్పట్లు కొడుతూ పాటలు పాడుతూ ఆడటం, పోటీలు పడుతూ బతుకమ్మలను తయారుచేసి పరవశించడం ఇక్కడి ప్రత్యేకత. వివిధ రకాల పూలను, ఆకులను తెచ్చి, అందంగా అలంకరించి ఆ బతుకమ్మను అమ్మవారి అవతారాలుగా భావించి పూజిస్తారు. ఈ పండగలో ఆటపాటలతోపాటు రకరకాల వంటలు చేసి, అందరికీ పంచడం బతుకమ్మ సంస్కృతి.

జానపద సంగీతంలో బతుకమ్మ పాటలకు ప్రత్యేక స్థానముంది. ఈ పాటల్లో పురాణాలు, మానవీయ విలువలను తెలిపే విషయాలు, అత్తాకోడళ్ల హాస్యపు చతురోక్తులు ఉంటాయి. డప్పు వాయిద్యాలు, చప్పట్లు ఈ పాటలకు చక్కటి ఊపునిస్తాయి. ఈ పాటల్లో తరచుగా ఉయ్యాలో, చందమామ, వలో, కోల్‌కోల వంటి పదాలు వస్తూ.. అటు ఆడేవారికి ఇటు పాడేవారికి ఉత్సాహాన్ని కలిగిస్తాయి. కాలానుగుణంగా రాజకీయ, సామాజిక, సాంఘిక సమస్యలన్నీ బతుకమ్మ పాటల్లో తమ స్థానాన్ని పదిలపరుచుకున్నాయి. స్వాతంత్ర్యోద్యమం, తెలంగాణ సాయుధ పోరాటంలో ఈ పాటలు చారిత్రక పాత్రను పోషించాయి. ప్రజల్లో చైతన్య జ్వాలలు రగిలించాయి. నిజాంపై సమరశంఖం పూరించేలా ప్రజలను సమాయత్తం చేశాయి.

హైదర్ అలీ, టిప్పు సుల్తాన్ హయాంలోనూ మైసూర్ మహోత్సవాలు

మతం పేరుతో విద్వేషం చిమ్మడం, అధికారం కోసం ఇతర మతాల ప్రార్థనా మందిరాలపై దాడులు చేయడం, దళితులను, మైనారిటీలను బలిగొనడం చేస్తున్న నేటి రోజుల్లో టిప్పు సుల్తాన్ పాటించిన మత సామరస్యాన్ని, పరమత సహనాన్ని గుర్తు చేసుకోవాలి. అప్పటి మైసూర్ మహారాజులైన వడయార్లు 1610లో దసరా ఉత్సవాలను వైభవంగా జరపడం ప్రారంభించారు. తమ కుటుంబ దేవత చాముండేశ్వరీ దేవి మహిషాసురుడిని సంహరించినందుకు ప్రతీకగా ఈ ఉత్సవాలు జరిపేవారు. తొలుత అమ్మవారిని ఆరాధించి, ఏనుగుపై ఊరేగించేవారు. 1750 నుంచి హైదర్ అలీ, టిప్పు సుల్తాన్ చేతుల్లోకి మైసూర్ పాలన వెళ్లినప్పటికీ ఈ ఉత్సవాలు మరింత ఘనంగా నిర్వహించేందుకు కృషి చేశారు. మతం పేరుతో ఎటువంటి తేడాను చూపలేదు. అంతేకాదు టిప్పు సుల్తాన్ తుదివరకూ బ్రిటీష్ వారిపై పోరాడాడు. నాలుగో ఆంగ్లో – మైసూర్ యుద్ధంలో 1799వ సంవత్సరం మే 4న వీరమరణం పొందాడు. హైదర్ అలీ, టిప్పు సుల్తాన్ కాలంలో అత్యంత వైభవోపేతంగా జరిగిన ఉత్సవాల గురించి ఎన్నో చారిత్రక ఆధారాలున్నాయి. తాము పరిపాలిస్తున్నప్పటికీ వడయార్ కుటుంబీకులనే రాజుగా ఆ ఉత్సవాల్లో ప్రజల ముందుంచి, కమాండర్– ఇన్– చీఫ్‌గా వ్యవహరించేవారు. రాష్ట్రంలోని ప్రముఖులందరినీ ఉత్సవాలకు ఆహ్వానించేవారు. పది రోజులపాటు విందు ఏర్పాటు చేసేవారు. బాణాసంచా కాల్పులు, సింహాలు, పులులు, ఎలుగుబంట్లు వంటి క్రూర మృగాలతో పోరాటం, రెజ్లింగ్ తదితర అనేక పోటీలు నిర్వహించేవారు. విజేతలకు బహుమతులు, వేతనాల పెంపుతోసహా అనేక సౌకర్యాలు కల్పించేవారు. ఈ ఉత్సవాల్లో, పోటీల్లో మతాలకు అతీతంగా పాల్గొనడం నాటి నుంచీ కొనసాగుతూనే ఉంది. ఈ ఉత్సవాల సందర్భంగా నెల రోజుల ముందు నుంచే ఇక్కడ హడావిడి మొదలవుతుంది. రాజభవనాన్ని ప్రత్యేకంగా అలంకరిస్తారు. ప్యాలెస్ అంతా లక్షకుపైగా బల్బుల అలంకరణతో దేదీప్యమానంగా శోభిస్తుంది. వైవిధ్యమైన జానపద కళారూపాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. క్రీడల పోటీలు ఇందులో భాగవే. ప్రదర్శనకు అగ్రభాగాన అందంగా అలంకరించిన ఏనుగులు పాల్గొనడం ఇక్కడ ప్రత్యేకత. ఏనుగుపైనే చాముండేశ్వరీ దేవిని ఊరేగిస్తారు. ఆయుధపూజ వైభవంగా నిర్వహిస్తారు. నగరం వెలుపల నిర్వహించే టార్చ్‌లైట్ పరేడ్‌లో యువత ఉత్సాహంగా పాల్గొంటారు.

ఉత్తరాదిన..

ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో 200 ఏళ్లుగా తొమ్మిది రోజులపాటు 'రామలీల' నాటకాన్ని ధారావాహికంగా ప్రదర్శిస్తారు. ఇక ఢిల్లీలో 170 ఏళ్ల కింద మొఘల్ చక్రవర్తి బహద్దూర్ షా జాఫర్ 'రామలీల' సంగీతాలను ప్రారంభించారు. నాటి నుంచి దసరా నవరాత్రుల్లో ఇవి కొనసాగుతూనే ఉన్నాయి.

400 ఏళ్ల నుంచి కళారం

ఒంగోలు చిన్న గ్రామంగా ఉన్నప్పుడు కళారం ఆచారం ప్రారంభమైంది. కళారం అనే పదం కరాళ వక్త్రం (ఖండించి నాలుక తెరిచి ఉంచిన శిరస్సు) నుంచి వచ్చిందట. ఇక్కడి పురాణ కథల ప్రకారం.. బ్రహ్మ వరం వల్ల రక్తబీజుడనే రాక్షసుడి రక్తం నేలమీద పడితే మళ్లీ పుట్టుకొస్తాడట. అందువల్ల ఆదిపరాశక్తి తన నాలుకను యుద్ధ క్షేత్రం అంతా ఆవరించి, ఒక్క చుక్క రక్తం కూడా నేల మీద పడకుండా రక్తభీజుడిని సంహరించింది. అలా ఉన్న ఆమె శిరస్సు రూపాన్ని శరన్నవ రాత్రుల్లో ఊరేగిస్తారు. ఈ నగరంలో కాళికాదేవి, మహిషాసుర మర్దని, నరసింహస్వామి తదితర ఆరు కళారాలు ఆరు రంగుల్లో నిర్వహిస్తారు. తొలిరోజుల్లో గూడు బండ్లపై కళారాలను ఊరేగించేవారు. రాగి, ఇతర లోహాలతో నాలుగు అడుగుల ఎత్తులో వీటిని తయారు చేస్తుండటంతో కనీసం పదిమంది ఉంటే గాని వీటిని పైకి లేపలేరు. ఒక వాహనంపై అడ్డంగా కడ్డీ ఉంచి, దానిపై శిరస్సు ఉంచుతారు. కళారం వెనుకభాగంలో ఒకరు వీరనృత్యం చేస్తూ... కళారాన్ని ఊపుతూ ఉంటారు. ఈ కళారంతోపాటు వాయిద్య ఘోషలు, పురాణ పాత్రల వేషధారణలు దుర్గాష్టమి రోజు అర్ధరాత్రి 12 గంటల నుంచి మరుసటి రోజు మధ్యాహ్నం వరకూ ఈ కళారాలు సాగుతాయి. ఊరిమధ్యలో రాక్షస సంహార ఘట్టాన్ని ప్రదర్శిస్తారు. ఈ కళారాలలో నరసింహస్వామి కళారం పెట్టడం ఆనవాయితీ. ఆయనకు కూడా అమ్మవారి నుంచే శక్తి లభించిందట. ఈ రెండు రోజులు అర్ధరాత్రి సమయంలో సైతం వేలమంది జనం పాల్గొంటారు.

బెజవాడ బేతాళ వేషాలు..

దసరా ఉత్సవాల్లో ఆఖరి రోజు విజయ దశమినాడు రాత్రి సమయంలో ఇంద్రకీలాద్రిపై కనకదుర్గాదేవి, మల్లేశ్వర స్వామి వార్లు కృష్ణానదిలో హంసవాహనంపై నదీవిహారం చేస్తారు. అమ్మవారి త్రిలోక సంచారానికి గుర్తుగా నదిలో మూడుసార్లు హంసవాహనాన్ని (తెప్పను) తిప్పుతారు. దాదాపు తొమ్మిది దశాబ్దాల క్రితం బెజవాడ బేతాళ వేషాలు ప్రారంభమయ్యాయి. తెప్పోత్సవం ముగిసిన తరువాత ఉత్సవ మూర్తులతో అప్పట్లో గ్రామోత్సవం నిర్వహించేవారట. ఇప్పుడు కూడా పోలీసుల పర్యవేక్షణలో పాతనగరంపై ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్నారు. ఊరేగింపు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు రావడంతో ముగుస్తుంది. చివరిరోజు ప్రభలు ఊరేగింపుగా వస్తాయి. ఈ సందర్భంగా ప్రదర్శించేఉ భేతాళ నృత్యం విజయవాడ ప్రత్యేకత. మొదట్లో పాతబస్తీ కొత్తపేట కేంద్రానికి చెందిన బి.గురువులు, చంటి బేతాళ వేషాలు వేసేవారు. ఈ వారసత్వం నేటికీ కొనసాగుతోంది. కాళికాదేవి వేషానికి అవసరమైన చేతుల బరువు పాతిక కిలోలు ఉంటుంది. వాటిని వీపునకు తగిలించుకుని, తలపై కిరీటం పెట్టుకుని.. నృత్యం చేసే కళాకారులు ఎందరో ఉన్నారు. ఈ బృందాలు ఇతర ప్రాంతాలకూ విస్తరించాయి.

మచిలీపట్నంలో శక్తిపటం..

కాళికా నృత్యం

కృష్ణాజిల్లా మచిలీపట్నంలో శక్తి ఆరాధన, శక్తిపటాల ప్రదర్శన నిర్వహిస్తారు. నవరాత్రి ఉత్సవాల్లో మొదటిరోజు తెల్లవారుజామున ఊరి పొలిమేరలో ఓ వ్యక్తి శక్తిపటాన్ని ఎత్తుకుంటాడు. ముఖానికి కరాళం (మాస్కు) ధరించి, చేతిలో చురకత్తితో కనక తప్పెట్ల మధ్య కాళికా నృత్యాన్ని తలపించేలా ప్రదర్శన చేస్తాడు. వెదురుతడికతో ఆరు నుంచి ఎనిమిది అడుగుల ఎత్తున శక్తిపటాన్ని తయారు చేస్తారు. 25 నుంచి 30 కిలోల బరువుండే శక్తి పటాన్ని మోస్తూ.. ఈ కార్యక్రమం నిర్వహించడం ఆ వ్యక్తికి కత్తిమీద సామే.

వీరవాసరంలో అంబరాన్నంటే ఏనుగు సంబరం

పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం 'ఏనుగు సంబరానికి' దాదాపు ఒకటిన్నర శతాబ్దాల చరిత్ర ఉంది. దసరా వెళ్లిన తరువాత వచ్చే మూలా నక్షత్రం రోజు బేతాళస్వామి ఉత్సవాలు ప్రారంభిస్తారు. బేతాళ సంబరం జరిగే రోజు బేతాళ స్వామి ప్రతిమను, ఖడ్గాయుధాన్ని గడ్డితో తయారు చేసిన ఏనుగు బొమ్మ అంబారీ ఎక్కిస్తారు. దీంతోపాటు మరో చిన్న ఏనుగు బొమ్మనూ తయారు చేస్తారు. ఆ రోజు రాత్రి నుంచి దాదాపు తెల్లవారే వరకూ వీరవాసరం పశ్చిమ కాలువ వద్ద నుంచి ప్రధాన రహదారి వెంట బుట్టబొమ్మలు, పౌరాణిక పాత్రలు, పగటి వేషాలు, మేళ తాళాలతో ఊరేగిస్తారు. బేతాళ స్వామి ప్రతిమను తూర్పు చెరువులో నిమజ్జనం చేస్తారు. ఖడ్గాయుధాన్ని తిరిగి ఆలయంలో ఉంచడంతో ఏనుగు సంబరం ముగుస్తుంది. ఈ ఉత్సవాలు చూసేందుకు దాదాపు 50 గ్రామాల ప్రజలు వస్తారు.

దసరా వేషాలు..

దసరా రోజుల్లో వివిధ వేషధారణ చేసి ఇంటింటికీ తిరిగి ఇచ్చింది పుచ్చుకోవడం ఆనవాయితీగా వస్తోంది. వీటినే దసరా వేషాలు.. పగటి వేషాలు అంటారు. ఈ పర్వదినాల్లో ఎన్నో జానపద, సినీ గీతాలు హుషారెత్తిస్తాయి. 'దసరా వచ్చిందయ్యా.. సరదా తెచ్చిందయ్యా.. దశమి వచ్చిందయ్యా.. దశనే మార్చిందయ్యా.. జయహో..' లాంటి సినీ గీతాలు ఎన్నో వింటూ ఉంటాం.

మిగతా పండగల మాటెలా ఉన్నా.. దసరా పండగ ప్రకృతితో మనల్ని మమేకం చేస్తుంది. మూలాల్లోకి వెళ్లేలా చేస్తుంది. ఎంతో సాత్వికంగా ఉండే మహిళలే విశ్వమంతటికీ మూలమైన మహాశక్తి అంటూ చాటిచెబుతుంది. పురుష దేవతలకు శక్తిని ప్రసాదించింది అమ్మవారేనంటూ.. మహిళల ప్రాధాన్యతకు అద్దం పడుతుంది. దసరా అంటే ప్రకృతికి ప్రణామం.. మాతృమూర్తికి వందనం.. మనిషి మూలాలకు ప్రయాణం..

మత సామరస్యానికి ప్రతీక బెంగాల్ ఉత్సవాలు

పశ్చిమ బెంగాల్‌లో అతి పెద్ద పండగ దుర్గాపూజ. ఈ రాష్ట్రంలో మతసామరస్యానికి ప్రతీకగా కూడా నిలుస్తాయి. కలకత్తా తదితర ప్రాంతాల్లో ముస్లిములు తమ చుట్టుపక్కల ఉన్న హిందువులు పూజలు నిర్వహించుకునేందుకు వీలుగా దుర్గా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. దశాబ్దాలుగా ఈ ఆనవాయితీ రాష్ట్రంలో కొనసాగుతూనే ఉంది. వామపక్షాల పాలనలో ఈ పరంపర మరింతగా దృఢమైంది. ఉత్సవాల్లో మతాలకు అతీతంగా అందరూ సరదాగా పాల్గొని, తమ ఆత్మీయ అనుబంధాలను కొనసాగిస్తారు. ఈ ఉత్సవాల సందర్భంగా వీధులన్నీ విద్యుత్ వెలుగులతో, వివిధ అలంకరణలతో శోభాయమానంగా ఉంటాయి. సప్తమి, అష్టమి, నవమి తిథుల్లో దుర్గామాతకు పూజ చేసి, తొమ్మిరోజున కాళికామాతను దర్శిస్తారు. ఈ పూజలో సాంబ్రాణి వేసుకున్న మట్టి కుండలు పట్టుకుని చేసే నాట్యానికి ప్రసిద్ధి. కొందరు మహిళలు కుండల్ని నోటితో కూడా పట్టుకుని నృత్యం చేస్తారు. దీంతోపాటు సింధూరం పూసుకోవడం మరో ప్రత్యేకత. మహిళలు ఒకరి చెంపలపై మరొకరు సింధూరం పూస్తారు. ఈ ఉత్సవాల్లో లక్షల మంది పాల్గొంటారు. చివరి రోజు దుర్గామాత విగ్రహాలను హుగ్లీ నదిలో నిమజ్జనం చేస్తారు. ఈ తొమ్మిదిరోజులు రాష్ట్రమంతా హరికథలు, పురాణ శ్రవణం, ఉత్సవాల పందిళ్లలోనే పుస్తక ప్రదర్శనలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తారు.

ఒడిశాలో దసరా ఉత్సవాల్లో దుర్గాదేవిని ఆరాధిస్తారు. కటక్ కళాకారులు రూపొందించిన విగ్రహాలను వీధుల్లో ప్రతిష్టిస్తారు. మహిళలు మానికలో వడ్లు నింపి, పూజలు చేస్తారు. దీనిని 'మానబాన' అంటారు. దసరా రోజున బాణా సంచా కాలుస్తారు.

దేవరగట్టు కర్రల సమరం..

కర్నూలు జిల్లా దేవరగట్టులో 800 అడుగుల ఎత్తయిన కొండపై మాలమల్లేశ్వరస్వామి ఆలయం ఉంది. ఇక్కడ ఉన్న పురాణ కథ ప్రకారం మాల, మల్లాసుర అనే రాక్షసులు ఉండేవారు. వారిని పార్వతీదేవి సంహరించింది. చనిపోవడానికి ముందు ఏటా దసరా నాడు తమకు నరబలి కావాలని వారు వరం కోరారట. సాధ్యం కాదని, ఆ రోజున గొరవయ్య తొడ నుంచి పిడికెడు రక్తాన్ని ధారపోయిస్తానని వరమిచ్చిందట. దీనికి గుర్తుగా బన్ని జైత్రయా త్ర ఏటా దసరా నాడు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా మూడు గ్రామాల వారు ఉత్సవ మూర్తులను కల్యాణ కట్ట వద్దకు తీసుకొా స్తారు.

## రాగిడి లక్ష్మారెడ్డి కాలేరు జె నవీన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో భారీ చేరికలు



మేడిపల్లి, అక్టోబర్ 22 (ప్రజాపాలన ప్రతినిధి) :ఉప్పల్ నియోజకవర్గం హబ్సిగూడ డివిజన్ బీఆర్ఎస్ పార్టీలో చేరికల పర్వం పెద్ద ఎత్తున కొనసాగుతున్నది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, ఉప్పల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య సమక్షంలో బీఆర్ఎస్ లో చేరిన వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకెళ్తుందన్నారు. బీఆర్ఎస్ పాలనలోనే తెలంగాణ సుభిక్షంగా ఉంటుందని, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు 500 మంది కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పలకల నరసింహారెడ్డి,సంజయ్ జైన్, మంజరి సంతోష్, మల్లేష్ యాదవ్, గజ్జల రాజు, నరేష్ శ్రావణ్ కుమార్, కరిపే మల్లికార్జున్, నిమ్మ సురేందర్ రెడ్డి, యశ్వంత్, పవన్ యాదవ్, జహీర్, అజీజ్, మదన్, అల్లు, కార్తీక్, రాజ్ కుమార్ గౌడ్, సన్నీ గౌడ్, పవన్, కార్తీక్ రెడ్డి, జితేందర్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గులాబీ జెండా ఎత్తుకున్న ఉప్పల్ యువత





మేడిపల్లి, అక్టోబర్ 22 (ప్రజాపాలన ప్రతినిధి) : ఉప్పల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి గెలుపే లక్ష్యంగా ఉప్పల్ యువత ఏకమవుతోంది. ఆదివారం బీఆర్ఎస్ నాయకులు పూడూరి జితేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉప్పల్, చిలుకానగర్ కు చెందిన వందలాది మంది యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. రెండు డివిజన్లకు చెందిన పలువురు మహిళలు, కాలనీల వాసులు కూడా పార్టీలో చేరారు. వీరికి ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, ముఖ్య నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఉప్పల్ పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. అంతకుముందు ఉప్పల్ లోని సాయిరాం నగర్, సాయిబాబా నగర్, విజయపురి కాలనీ, శాంతి నగర్ మీదుగా ఉప్పల్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వరకు పూడూరి జితేందర్ రెడ్డి ఆధ్వర్యంలో యువకులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అరటికాయల భాస్కర్, మేకల హనుమంత్ రెడ్డి, మేకల మధుసూదన్ రెడ్డి, పోగులు దయాకర్ రెడ్డి, నాగరాజ్, వీరేశం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కొమురం భీమ్ జయంతి సందర్బంగా రక్తదానం



మంచిర్యాల టౌన్, అక్టోబర్ 22, ప్రజాపాలన : కొమురం భీమ్ జయంతి సందర్భంగా తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్,రాష్ట్ర నాయకుడు జంగపెల్లి తరుణ్ లు ఆదివారం స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రాంతంలోని భూమి,నీరు,అడవి మీద హక్కుల కోసం నిజాం కి వ్యతిరేకంగా పోరాడి హక్కులను సాధించాడని,ఆయన వీరోచిత పోరాటం నేటి యువతకు మార్గదర్శనం అని కొనియాడారు. కానీ నేడు ఖనిజ సంపదల పేరుతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నేటి ఆదివాసి తెగల హక్కులను హరిస్తున్నాయని మండిపడ్డారు. యువత తమ బాధ్యతగా స్వచ్ఛందంగా రక్తదానం చేసి,ఆపదలో ఉన్నవారిని కాపాడాలని కోరారు.

## మహిషాసురమర్దిని రూపంలో వాసవి మాత అలంకరణ



సంగారెడ్డి, ప్రజాపాలన ప్రతినిధి: సంగారెడ్డి పట్టణ శివారులోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శరన్నవరాత్రి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎనిమిదవరోజు అమ్మవారిని మహిషాసురమర్దిని రూపంలో ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయకమిటి సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ అధికారులు రాగానే ప్రజలకు 6 గ్యారంటీ పథకాలు



మధిర అక్టోబర్ 22 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలోని జిలుగుమాడు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లిత్రివేదుల వెంకటేశ్వర్లులి మరియు లిదోర్నాల కృష్ణలి ఆధ్వర్యంలో గడపగడపకు తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజలకు వివరిస్తూ లిమల్లు భట్టి విక్రమార్కకి తమ అమూల్యమైన ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ.తెలంగాణాలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని కేసీయార్ నియంత పాలనకు చరమగీతంపాడే రోజు త్వరలోనే ఉందని అన్నారు.కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు ముఖ్యమైన గ్యారెంటీ పథకాలు పెరిగిన ధరలతో విసిగిపోతున్న ఆడబిడ్డలకు తోడుగా ఉండేందుకు "మహాలక్ష్మి పథకం"భంగపడ్డ రైతులకు భరోసా కల్పించడానికి "రైతు భరోసా పథకం:విద్యుత్ ధరలతో సతమతవుతూ.. చీకటి అలుముకున్న పేద ప్రజల ఇంట్లో వెలుగులు నింపేందుకు "గృహ జ్యోతి పథకంనిరాశ్రయులకు ఆశ్రయం కల్పించి వారి కుటుంబాలకు రక్షణ కల్పించడానికి "ఇందిరమ్మ ఇళు పథకంనిస్సహాయయులైన నిరుద్యోగుల జీవితాలను నిలపెట్టడానికి "యువ వికాసంసమస్యలతో సతమతమవుతున్న వారిని ఆదరించేందుకు "చేయూత పథకం"ఇలాంటి మరెన్నో అద్భుతమైన పథకాలు పేద ప్రజలకు ఉపయోగపడేవి కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెడుతుందని కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారుఈ కార్యక్రమంలో లిదోర్నాల చిన్న కృష్ణ, దోర్నాల వెంకటరావు, దోర్నాల కోటేశ్వరరావు, నాగ శ్రీను, గడ్డం కృష్ణ ,దోర్నాల శ్రీనులి మొదలగువారు పాల్గొన్నారు

## ముమ్మరం రంగా సాగుతున్న బిఆర్ఎస్ ప్రచారం



ఇబ్రహీంపట్నం సెప్టెంబరు 22 ప్రజాపాలన ప్రతినిధి:ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని పెద్దతుండ్ల గ్రామంలో 112,113 బూత్ లో ఇంటి ఇంటికి. తిరిగి బి ఆర్ ఎస్ పార్టీ మేనిపెస్టో ని వివరిస్తున్న ఇబ్రహీంపట్నం మండల్ అధ్యక్షులు చిలుకల బుగ్గరాములు మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం మంచిరెడ్డి కిషన్ రెడ్డి విజయభేరి ఆకాంక్షిస్తూ ప్రతి గ్రామీణ ప్రచారం ముమ్మరంగా ప్రచారం బి ఆర్ ఎస్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు తెలియజేస్తు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిలకల యాదగిరి , గ్రామ అధ్యక్షులు గుజ్జ యాదగిరి , సింగిల్ విండో వైస్ చైర్మన్ సమ రవీందర్ మాజీ సర్పంచ్ కొంగర బీరప్ప , వార్డ్ నెంబర్లు, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు పాల్గొనడం జరిగింది.

## పల్లెల పట్టణ ప్రజల చూపులు బిఆర్ఎస్ పార్టీ వైపు: బిఆర్ఎస్ మండల అధ్యక్షులు చీరాల రమేష్



ఇబ్రహీంపట్నం సెప్టెంబరు 22 ప్రజాపాలన ప్రతినిధి :పిసి తండా ,నోముల లోయపల్లి, బోడకొండ గ్రామాలలో బూత్ స్థాయి ముఖ్య సమావేశాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మండల అధ్యక్షులు చీరాల రమేష్ , కార్యదర్శి కాట్రోత్ బహదూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య,పిఎసిఎస్ చైర్మన్ బస్సు పుల్లారెడ్డి ఆయా గ్రామ అధ్యక్షులు ఆధ్వర్యంలో సమావేశాలలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ని నాలుగవసారి ఇబ్రహీంపట్నం గడ్డపై మళ్లీ విజయ దుందుభి మోగించడం ఖాయమని ప్రజలు అనుకుంటున్నారు అని కాబట్టి కాంగ్రెస్ , బిజెపి పార్టీలకు డిపాజిట్లు రాకుండా ప్రతి కార్యకర్త బూత్ స్థాయిని బలోపేతం చేయాల్సిందిగా ముఖ్యులు విన్నవించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు బాలరాజు, రాజు, పార్టీ సీనియర్ నాయకులు రామ్ రెడ్డి ,జానీ పాషా యూత్ అధ్యక్షులు బద్రీనాథ్ గుప్తా, గంట విజయ్, నారి యాదయ్య ,బొట్టు ప్రవీణ్ , మండల ప్రచార కార్యదర్శి చిందం జంగయ్య, ప్రభాకర్, వీరేష్,పార్టీ అధ్యక్షులు జానయ్య గౌడ్ ,బాపూజీ, కర్ణాకర్ రెడ్డి ,శీను, హనుమంతు, విష్ణు, జంగయ్య ఆయా గ్రామాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థి పరమేశ్వర్ రెడ్డిని గెలిపించాలని కార్పొరేటర్ ప్రచారం



మేడిపల్లి, అక్టోబర్ 22 (ప్రజాపాలన ప్రతినిధి ):ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మందుముల పరమేశ్వర్ రెడ్డిని గెలిపించాలని ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఉప్పల్ డివిజన్లోని పద్మావతి కాలనీలో ఇంటింటా తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చిన డిక్లరేషన్ల ప్రజలకు వివరిస్తూ గెలుపే లక్ష్యంగా ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.కాంగ్రెస్ పార్టీ ఇచ్చే 6 గ్యారంటీలు ప్రజలకు తెలుపుతూ, కాంగ్రెస్ పార్టీ చేయి గుర్తుకు ఓటు వేసి ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పరమేశ్వర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కార్పొరేటర్ ప్రజలను కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాకారం లక్ష్మణ్ ,సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఈగ అంజయ్య , బుసం రఘునాథ్ రెడ్డి,సల్ల ప్రభాకర్ రెడ్డి,కాలనీ అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి ,కృష్ణ , గూడూరి నర్సింహా రెడ్డి, మల్లేష్, దేవేందర్ రెడ్డి,రాము,మధు, రవి, పెంటయ్య, శామ్యూల్, రామకృష్ణ, శ్రీనివాస్ రెడ్డి,బుచ్చి రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ 3 న ఇర్ఫాని దర్గా ఉర్సు ఉత్సవాలు



సంగారెడ్డి, ప్రజాపాలన ప్రతినిధి: సంగారెడ్డి పట్టణ శివారులో ఉన్న ఇర్ఫాని దర్గా ఉత్సవాలు నవంబర్ 3, 4 తేదీలలో జరుగుతాయని దర్గా పీఠాధిపతి హకీమ్ ఉమర్ బిన్ అహ్మద్ తెలిపారు. ఆదివారం దర్గా పీఠాధిపతి హకీమ్ ఉమర్ బిన్ అహ్మద్ ఆధ్వర్యంలో ఉర్సు ఉత్సవాల వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 3 వ తేదీన గంధం ఊరేగింపు, అఖిల భారత కవి సమ్మేళనం, 4 న దీపారాధన, ఖవ్వాలి, అన్నదానం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో షకీల్, జలాల్, షాహేద్, అహ్మద్, మొహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో కనకదుర్గ దేవి అలంకారం



మధిర అక్టోబర్ 22 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భాగంగాఈ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం నందు దేవి శరన్నవరాత్రి ఉత్సవాల ఎనిమిదవ రోజు సందర్భంగా శ్రీ కనకదుర్గ దేవి అలంకారం భక్తులందరికీ తెలియజేయునది ఏమనగా దసరా సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ముఖ ద్వారం నుండి దర్శించు కొన వలసిందిగా కోరుచున్నాము పూజ అనంతరం భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ కనకదుర్గ దేవి అమ్మవారు ఈ శరన్నవరాత్రి సందర్భంగా దేవాలయ అధ్యక్షుడు కపిలవాయి జగన్మోహన్రావు మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినాము అని తెలిపినారు. పూజ చేయించుకునే భక్తులు శేషాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం నిర్వహించదరు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించవలసిందిగా కోరుచున్నాము. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు సాయంత్రం పెద్ద ఎత్తున మహిళా భక్తులతో బతుకమ్మ ఆటలు అలాగే నేడు దసరా పండుగ సందర్భంగా అమ్మవారి దేవాలయం వెనుక భాగంలో జమ్మి పూజా కార్యక్రమం నిర్వహించబడును.కావున భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొనగలరు

## దేశభక్తి యువజన సంఘం ఆధ్వర్యంలోదేవీ నవరాత్రులలో మహా అన్నదానం




మధిర రూరల్ అక్టోబర్ 22 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో 18 వ వార్డు కౌన్సిలర్ అరిగ రజనీ శ్రీనివాసరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ పన్నెండవ వార్డు కౌన్సిలర్ మొండితోక నాగరాణి సుధాకర్ పేర్కొన్నారు. స్థానిక లడక బజార్ దేశభక్త యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవి నవరాత్రుల సందర్భంగా 8వ రోజు భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన వారు ఈ సందర్భంగా దేశభక్తి యువజన సంఘం వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం దేవి నవరాత్రులలో మహానదానం నిర్వహించటం దాతల సహకారంతో ఈ రోజు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు వారు తెలిపారుఅన్నం పరబ్రహ్మ స్వరూపమని అన్నదానం చేయటం ఆ మహా కనకదుర్గ తల్లి ఆశీస్సులు అందరికీ ఉండాలని వారు తెలిపారు ఈ సందర్భంగా దేశభక్తి యువజన సంఘం వారు ప్రతి ఒక్కరికి భక్తులకు సాయి సహకారాలు అందించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. తొలుత అమ్మవారిని కనకదుర్గాదేవి అలంకారంలో అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని భక్తుల ఆర్థిక సహకారంతో నిర్వహించారు సాయంత్రం బతుకమ్మలు ఆటపాటలతో నిర్వహించి అమ్మవారి ఊరేగింపు కలలు పండగ భారీ ఎత్తున కోలాటం డబ్బుకు మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేశభక్తి యువజన సంఘం అమ్మవారి ఉత్సవ కమిటీ నిర్వాహకులు పట్టణ ప్రముఖులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గద్దల దినమ్మ పార్థివదేహాన్ని నివాళులు అర్పించిన మొండితోక సుధాకర్



మధిర అక్టోబర్ 22 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలోఎస్సీ కాలనీ 12వ వార్డు నివాసులు తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చ్ కమిటీ నెంబర్ గద్దల దీనమ్మ ఈరోజు అకాల మరణం చెందినారు వారి పార్థివదేహానికి పూలమాలలు వేసి ఆర్థిక సాయం చేసి నివాళులు అర్పించిన జిల్లా నాయకులు లిమొండితోక సుధాకర్ రావు చిలక రాజేంద్రప్రసాద్ గద్దల అనిల్ చ టారిప్రసాద్ నందిపాటి చిన్నబాబు తదితరులు నివాళులు అర్పించారు కార్యక్రమంలో మొండితోక సుధాకర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు

## 'దేవర' యాక్షన్ పై లేటెస్ట్ అప్ డేట్ !





ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో 'దేవర' సినిమా చేస్తున్నాడు. అయితే, తాజాగా ఈ సినిమాకి సంబంధించి ఓ ఇంట్రెస్టింగ్ గాసిప్ వినిపిస్తోంది. ఈ సినిమాలో ఓ స్పెషల్ యాక్షన్ సీక్వెన్స్ ఉంది. ఇప్పుడు ఈ సీక్వెన్స్ కోసం ఓ స్విమ్మింగ్ పూల్ సెట్ ను వేసినట్లు తెలుస్తోంది. ఈ సీక్వెన్స్ మొత్తం సముద్రం నేపథ్యంలోనే జరగనుంది. ఎక్కువగా వీఎఫ్ఎక్స్ విజువల్సే ఉంటాయట. వచ్చే వారం నుంచి ఈ యాక్షన్ సీక్వెన్స్ ను షూట్ చేయాలని కొరటాల శివ ప్లాన్ చేస్తున్నాడు. అన్నట్టు ఈ యాక్షన్ సీక్వెన్స్ చాలా థ్రిల్లింగ్ గా ఉంటుందట. దేవర సినిమాను దాదాపు రూ.300 కోట్ల భారీ బడ్జెట్ తో తెరకెక్కిస్తున్నారని తెలుస్తోంది. ఇక ఎన్టీఆర్ – కొరటాల శివ కలయికలో ఈ సినిమా వస్తుండే సరికి, ఈ సినిమా పై భారీ అంచనాలు ఉన్నాయి. పైగా ఈ సినిమాను తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో కూడా ఒకేసారి రిలీజ్ చేసేందుకు చిత్రబృందం ప్లాన్ చేస్తోంది. ఇప్పటికే ఎన్టీఆర్ – కొరటాల కాంబినేషన్ లో గతంలో వచ్చిన 'జనతా గ్యారేజ్' పెద్ద హిట్ కావడంతో ఈ సినిమాపై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి.

## మిడిల్ ఏజ్ తండ్రిగా మహేష్ ?




సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో 'గుంటూరు కారం' సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం సంక్రాంతి పండుగ సందర్భంగా జనవరి 13, 2024న రిలీజ్ కానుంది. ప్రస్తుతం మహేష్ ఫ్యాన్స్ ఈ సినిమా క్రేజీ అప్ డేట్స్ కోసం విపరీతంగా ఎదురు చూస్తున్నారు. పైగా ఈ సినిమాతో మహేష్ కొత్త జానర్ లోకి అడుగుపెడుతున్నాడట. ఫ్లాష్ బ్యాక్ లో వచ్చే ఎపిసోడ్ లో పెద్దరికం సంతరించుకున్న మిడిల్ ఏజ్ తండ్రి పాత్రలో మహేష్ ఈ సినిమాలో కనిపించబోతున్నారని టాక్ నడుస్తోంది. మొత్తానికి చాలా గ్యాప్ తర్వాత మహేష్ 'గుంటూరు కారం'లో ఓ ఎమోషనల్ పాత్రలో కనిపించబోతున్నాడు. మరి సినిమా ఎలా ఉంటుందో చూడాలి. ఇక ఈ సినిమాలో మీనాక్షి చౌదరిని పూజా హెగ్డే స్థానంలో తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే, గుంటూరు కారం చిత్రంలో మీనాక్షి చౌదరి పాత్ర సెకండ్ హాఫ్ లో వస్తోందట. కాగా గుంటూరు మిర్చి యాడ్ నేపథ్యంలో ఈ సినిమా నడుస్తోంది. ముఖ్యంగా మహేష్ బాడీ లాంగ్వేజ్ కి సరిపడే సరికొత్త స్టోరీతో త్రివిక్రమ్ ఈ సినిమా కథని ప్లాన్ చేశాడట. హారిక %ండ% హాసిని క్రియేషన్స్ భారీ ఎత్తున ఈ సినిమాను నిర్మిస్తోంది. ఈ సినిమా మహేష్ కెరీర్లో 28వ సినిమాగా తెరకెక్కుతుంది. ఈ సినిమా పై భారీ అంచనాలు నెలకొన్నాయి.

## తెలుగు లాంగ్వేజ్ లో "లియో" సెన్సేషన్




కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ ప్రధాన పాత్రలో నటించిన లియో మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లతో దూసుకు పోతుంది. తెలుగు లో కూడా రిలీజ్ కి ముందు మంచి హైప్ ను సొంతం చేసుకున్న ఈ చిత్రం, అందుకు అనుగుణంగా మంచి వసూళ్ళను రాబడుతోంది. ఈ చిత్రం తెలుగు భాషలో వరల్డ్ వైడ్ గా 3 రోజుల్లో 32 కోట్ల రూపాయల వసూళ్లను రాబట్టడం జరిగింది. ఇది సూపర్ రెస్పాన్స్ అని చెప్పాలి. ఈ చిత్రం లాంగ్ రన్ లో మరింత వసూళ్లను రాబట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. త్రిష హీరోయిన్ గా నటించిన ఈ చిత్రం లో సంజయ్ దత్, అర్జున్, ప్రియా ఆనంద్, గౌతమ్ మీనన్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. అనిరుద్ రవి చందర్ ఈ సినిమాకి సంగీతం అందించారు.

## అల్లు అర్జున్ కంటే ముందే జాతీయ అవార్డ్?




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన యాక్షన్ డ్రామా పుష్ప: ది రైజ్ – పార్ట్ 1 విడుదలైన తర్వాత నిరంతరం హెడ్ లైన్స్ లో నిలుస్తున్నాడు. ఈ సినిమాలో అద్భుత నటనతో బన్ని ప్రపంచవ్యాప్తంగా హృదయాలను గెలుచుకున్నాడు. గత వారం పుష్ప లో నటనకు గాను ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డును దేశ అధ్యక్షురాలు ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకున్నాడు. 69వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో బన్నీకి ఈ అరుదైన గౌరవం దక్కింది. తెలుగు సినిమా హిస్టరీలో తొలిసారిగా ఒక హీరో ఉత్తమ నటుడుగా జాతీయ అవార్డును అందుకోవడం సెలబ్రేషన్ మూవ్ మెంట్. అయితే చాలా మందికి తెలియని మరొక విషయం కూడా ఉంది. నిజానికి అల్లు అర్జున్ జాతీయ అవార్డు అందుకోక ముందే అతడి తాత అల్లు రామలింగయ్య పేరిట జాతీయ అవార్డును పలువురు ప్రతిభావంతులకు అందించారు. అల్లు అర్జున్ తాత అల్లు రామలింగయ్య తెలుగు చిత్రసీమలో నటుడు– నిర్మాతగా సుపరిచితులు. అతని పేరు మీదనే జాతీయ అవార్డు ఉంది. ఈ అవార్డును ఎందరో ప్రతిభావంతులకు ఇప్పటికే అందజేసారు. రామలింగయ్య 1953లో పుట్టిల్లు సినిమాతో తన సినీ జీవితాన్ని ప్రారంభించారు. మాయాబజార్, మిస్సమ్మ, ముత్యాల ముగ్గు, శంకరాభరణం, సప్తపది, యమగోల వంటి అనేక చిత్రాల్లో చిరస్మరణీయమైన పాత్రలు పోషించారు. అల్లూ ప్రతినాయక పాత్రలు, హాస్య పాత్రలతో పాపులరయ్యారు. 1990లో ఆయనకు పద్మశ్రీ పురస్కారం లభించింది. అల్లు రామలింగయ్య అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ ఆయన స్మారకార్థం అల్లు రామలింగయ్య జాతీయ అవార్డును నెలకొల్పింది. ఈ అవార్డు ప్రతి సంవత్సరం తెలుగు చలనచిత్ర ప్రముఖులను జీవిత కాల సాధనకు గాను సత్కరిస్తుంది. అల్లు రామ లింగయ్య కనకరత్నంను వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు పిల్లలు – కొడుకు అల్లు అరవింద్ .. కుమార్తె సురేఖ. అల్లు అరవింద్ ఒక పెద్ద తెలుగు సినిమా నిర్మాత..పంపిణీదారు. గీతా ఆర్ట్స్ బ్యానర్‌ను స్థాపించి ఎన్నో విజయవంతమైన చిత్రాల్ని నిర్మించారు. ఆన్‌లైన్ స్ట్రీమింగ్ సర్వీస్ అయిన ఆహాకు సహ యజమానిగాను ఉన్నారు. విజేత, మాస్టర్, నినైతెన్ వంథై (తమిళం), మాంగళ్యం తంతునానేనా (కన్నడ), అన్నయ్య, జల్సా, గజిని, మగధీర, డార్లింగ్ (తమిళం) వంటి చిత్రా నిర్మాతగా అరవింద్ కెరీర్ లో అత్యంత ముఖ్యమైన చిత్రాలలో కొన్ని. గజినీ, జెర్సీ హిందీ రీమేక్‌లను కూడా ఆయన నిర్మించారు. అల్లు అరవింద్ నిర్మలను వివాహం చేసుకున్నారు. వారికి ముగ్గురు కుమారులు – అల్లు వెంకటేష్, అల్లు అర్జున్, అల్లు శిరీష్. అల్లు వెంకటేష్ ను బాబీ అని కూడా పిలుస్తారు. అల్లు వెంకటేష్ ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో కొనసాగుతున్నారు. అల్లు ఎంటర్‌టైన్‌మెంట్స్ వ్యవస్థాపకుడుగా ఉన్నారు. అతను ఆహా .. జస్ట్ టికెట్స్‌కు సహ వ్యవస్థాపకుడు. అల్లు బాబి తర్వాతివాడైన అల్లు అర్జున్ 2003లో గంగోత్రి సినిమాతో తెరంగేట్రం చేశాడు. తరువాత అతడు 2004లో సుకుమార్ చిత్రం ఆర్యలో కనిపించాడు. ఇది బన్నీకి హీరోగా బ్రేకింగ్ పాయింట్. ఆ తర్వాత అల్లు అర్జున్ బన్ని, హ్యాపీ, దేశముదురు వంటి అనేక విజయవంతమైన చిత్రాలను చేశాడు. రేసు గుర్రం, సరైనోడు, దువ్వాడ జగన్నాథం, అలా వైకుంఠపురములో, పుష్ప: ది రైజ్ అతడు నటించిన అత్యంత విజయవంతమైన చిత్రాలలో కొన్ని. అల్లు అర్జున్ స్నేహ రెడ్డిని వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు – కుమారుడు అయాన్ – కుమార్తె అర్హ. అల్లు అర్హ ఇప్పటికే శాకుంతలం సినిమాతో సినీ రంగ ప్రవేశం చేసింది. అరవింద్ చిన్న కుమారుడు అల్లు శిరీష్ 2013లో గౌరవం సినిమాతో కథానాయకుడిగా సినీ రంగ ప్రవేశం చేశాడు. ఆ తర్వాత కొత్త జంట, శ్రీరస్తు శుభమస్తు, ఒక్క క్షణం వంటి సినిమాల్లో నటించాడు.

## దసరా బాక్సాఫీస్... ఈ ముగ్గురి పాత్రల వల్ల నో యూజ్



ఈ దసరాకు బాలయ్య భగవంత్ కేసరి, రవితేజ టైగర్ నాగేశ్వరరావు, దళపతి విజయ్ లియో బాక్సాఫీస్ ముందు పోటీకి దిగిన సంగతి తెలిసిందే. అయితే ఈ మధ్య హద్దులు చెరిగిపోవడంతో స్టార్ బాలీవుడ్ యాక్టర్స్ సౌత్ సినిమాల్లో ఎక్కువగా నటిస్తున్నారు. ఇప్పుడీ మూడు చిత్రాల్లోనూ హిందీ నటులు కనిపించారు. కానీ ఈ బీటౌన్ యాక్టర్స్ పోషించిన పాత్రలు సినిమాకు ఎలాంటి ప్లస్‌గా నిలవకుండా పోయాయనే చెప్పాలి. భవవంత్ కేసరిలో స్టార్ యాక్టర్ అర్జున్ రాంపాల్ నటించారు. అయితే సినిమా ప్రమోషన్స్‌లో ఆయన పాత్ర బలంగా ఉంటుందని అన్నారు. కానీ వాస్తవానికి అంత సీన్ కనిపించలేదు. మూవీలో తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకోవడానికి ఎంతటికైనా తెగించే ఓ స్టీరియోటైపికల్ విలన్‌గా కనిపించారు. సీఎం నుంచి పీఎం వరకు మొత్తం రాజకీయ వ్యవస్థనే తన గుప్పిట్లో ఉండే ప్రతినాయకుడిగా చూపించారు. ఆయన నటన బాగానే ఉన్నప్పటికీ.. ఇప్పటికే ఇలాంటి పాత్రలను మనం చాలానే చూశాం. అదేం కొత్తగా కనిపించలేదు. బాలయ్య–శ్రీలీల నటన ఎమోషనల్ సీన్స్, యాక్టింగ్ ముందు విలన్ పాత్ర కాస్త తేలిపోయిందనే చెప్పాలి. టైగర్ నాగేశ్వరరావు చిత్రంలో సూపర్ టాలెంటెడ్ అనుపమ్ ఖేర్‌ను ఐబీ ఆఫీసర్‌గా చూపించారు. కానీ ఆయన క్యారెక్టర్ కథపై ఎలాంటి ప్రభావం చూపలేదు. సినిమాకు బలంగా నిలవలేదు. ఇదే పాత్రలో ఇతర రెగ్యులర్ క్యారెక్టర్ ఆర్టిస్ట్ నటించినా పెద్దతా తేడా ఏమీ ఉండేది కాదు. గ్యాంగస్టర్ లియో చిత్రంలోనూ ఇదే జరిగింది. దర్శకుడు అనురాగ్ కశ్యప్ మంచి నటుడన్న సంగతి తెలిసిందే. ఆయన పాత్రను మరింత సిల్లీగా చూపించేశారు. ఓ చనిపోయే పాత్రలో సింపుల్‌గా లాగించేశారు. అనురాగ్ కశ్యప్‌కు మరో మంచి పాత్ర ఇచ్చి ఉండే ఆయన మరింత బలంగా నటించేవారు. ఆయన్ను లియో మూవీటీమ్.. సరిగ్గా వాడుకోలేదనిపించింది. మొత్తంగా ఈ మూడు చిత్రాల్లోనూ ఫేమస్ బాలీవుడ్ యాక్టర్స్ అద్భుతంగా నటించారనే కానీ.. ఎవరీ పాత్ర కూడా అంతగా సినిమాకు బలంగా నిలవలేదు! దర్శకులు ఈ ముగ్గురి పాత్రలను బలంగా తీర్చిదిద్దలేదనే చెప్పాలి.

## నాని నెక్ట్స్.. రంగంలోకి...

ఈ మధ్యకాలంలో టాలీవుడ్ లో మలయాళీ మ్యూజిక్ డైరెక్టర్స్ కి డిమాండ్ పెరుగుతోంది. మలయాళం ఇండస్ట్రీ నుంచి గోపి సుందర్, అబ్దుల్ వాహబ్ లాంటి మ్యూజిక్ డైరెక్టర్స్ వచ్చి తెలుగులో సక్సెస్ అందుకున్నారు. తెలుగులో స్టార్ మ్యూజిక్ డైరెక్టర్స్ గా ఉన్న తమన్ పెద్ద సినిమాలతో బిజీ అయిపోయాడు. దేవిశ్రీ ప్రసాద్ సినిమాలు తగ్గించేసాడు. అలాగే వారి రెమ్యునరేషన్ కూడా మినిమం రేంజ్ సినిమాలు చేసే నిర్మాతలకి అందుబాటులో లేదు. కొంతమంది టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్స్ ఉన్న వారి సాంగ్స్ లో రిపీటేడ్ సౌండ్స్ వినిపిస్తున్నాయనే కంప్లైంట్స్ ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే మలయాళీ మ్యూజిక్ డైరెక్టర్స్ పై ఆసక్తి చూపిస్తున్నారు. గోపి సుందర్, తరహాలోనే టాక్సీవాలా సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన మ్యూజిక్ డైరెక్టర్ జేక్స్ బిజోయ్. మలయాళంలో స్టార్ మ్యూజిక్ డైరెక్టర్స్ గా ఉన్న జేక్స్ తెలుగులో చావు కబురు చల్లగా, పక్కా కమర్షియల్, ఒకే ఒక జీవితం సినిమాలకి సంగీతం అందించారు. ఈ నాలుగింటి రెండు సూపర్ హిట్ అయ్యాయి. అయితే ఆ సినిమాల సాంగ్స్ పరంగా జేక్స్ బిజోయ్ పేరు పెద్దగా సౌండ్ చేయలేదు. దీంతో తెలుగు ప్రేక్షకులకి అంతగా పరిచయం కాలేదు. అయితే నేచురల్ స్టార్ నాని ఇప్పుడు వివేక్ ఆత్రేయతో చేయబోతున్న %చీుఱఅఱ% 31 చిత్రం కోసం జేక్స్ బిజోయ్ ని మ్యూజిక్ డైరెక్టర్స్ గా కన్ఫర్మ్ చేశారు. తాజాగా పోస్టర్




తో ఈ విషయాన్ని ధృవీకరించారు. చివరిగా జేక్స్ బిజోయ్ నుంచి దుల్కర్ సల్మాన్ కింగ్ ఆఫ్ కోత సినిమా వచ్చింది. ప్రస్తుతం అతని చేతిలో నాలుగు మలయాళీ సినిమాలు ఒక తమిళ్ సినిమాలు ఉన్నాయి. వీటితో పాటు విశ్వక్ సేన్ హీరోగా రామ్ తాళ్లూరి నిర్మిస్తోన్న మూవీకి జేక్స్ మ్యూజిక్ అందిస్తున్నారు. అలాగే నాని 31వ సినిమాకి సినిమాటోగ్రాఫర్ గా మురళి జి కన్ఫర్మ్ అయ్యారు. ఇతను చివరిగా విజయ్ దేవరకొండ ఖుషి సినిమాకి వర్క్ చేశారు.




Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2/29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989